Rni Title Code No. TELTEL02115

## అత్యుత్తమ భారత బ్రాండ్ టీసీఎస్.. తరవాత స్థానాల్లో రిలయన్స్, ఇన్ఫోసిస్

దిల్లీ: అత్యంత విలువైన భారత బ్రాండ్‌గా ఐటీ దిగ్గజ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నిలిచింది. అత్యుత్తమ 50 బ్రాండ్‌లతో ఈ జాబితాను ఇంటర్‌బ్రాండ్ సంస్థ విడుదల చేసింది. ఈ జాబితాలో రూ.1,09,576 కోట్ల బ్రాండ్ విలువతో టీసీఎస్ అగ్రస్థానంలో నిలిచింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ (రూ.65,320 కోట్లు), ఇన్ఫోసిస్ (రూ.53,324) రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి. గత దశాబ్ద కాలంలో ఇతర రంగాలను అధిగమించి టెక్నాలజీ రంగం అగ్రస్థానంలో నిలిచింది. అగ్రగామి 5 బ్రాండ్‌లలో 3 స్థానాలను టెక్నాలజీ కంపెనీలే సాధించాయి. ఆర్థిక సేవల రంగం నుంచి 9 సంస్థలు జాబితాలో చోటు పొందాయి. హెూమ్ బిల్డింగ్, ఇన్‌ఫ్రా రంగం నుంచి 7 కంపెనీలు ఈ జాబితాలో స్థానం సంపాదించాయి.


# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 131 మేడ్చల్ మల్కాజ్‌గిరి 2 జూన్ 2023 శుక్రవారం పేజీలు : 4


# బీఆర్ఎస్‌కు 'మ్యాజిక్ ఫిగర్' దూరమేనా!?

## కాంగ్రెస్ మద్దతు తప్పదా!?

హైదరాబాద్ : రెండు సార్లు గెలిచిన ఉత్సాహంతో హ్యాట్రిక్ కొట్టడానికి బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ పెద్ద పెద్ద ప్లాన్లు వేస్తున్నారు. ఇప్పటికే టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చేసి తమది జాతీయ పార్టీ అని చెప్పుకొంస్తున్నారు. పక్కనున్న ఏపీ మహారాష్ట్రలలోనూ పోటీ చేయడానికి ప్లాన్లు చేస్తున్నారు. మొన్నటి కర్ణాటక ఎన్నికల్లో తన మిత్రుడు జేడీయూ అధినేత కుమారస్వామి కోసం పోటీ చేయకుండా ఉన్న కేసీఆర్ ఇప్పుడు వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి ప్రతిపక్షాలైన ఆమ్ ఆద్మీ సహ కలిసి వచ్చే పార్టీలతో కలిసి జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయంగా ఎదగాలని చూస్తున్నారు. టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చడం వెనుక కూడా రాజకీయం ఉందని.. దీనివెనుక కేసీఆర్ స్కెచ్ గీశారని అంటున్నారు. ప్రజల్లో ఇప్పుడు జాతీయ భావం మెండుగా ఉంది. బీజేపీ దాన్నే క్యాష్ చేసుకుంటోంది.

గుజరాత్ మోడల్ కు పోటీగా.. తెలంగాణ మోడల్ ను దేశానికి చూపించాలని కేసీఆర్ డిసైడ్ అయ్యారు. ఈ క్రమంలోనే మూడోసారి గెలుపు కష్టమని భావిస్తున్న కేసీఆర్ తెలంగాణలో కాంగ్రెస్ సహ చిన్న పార్టీల సాయం తీసుకోవడానికి కూడా వెనుకాడరని అంటున్నారు. ముఖ్యంగా జాతీయ సర్వేలు కూడా కేసీఆర్ ఈసారి మెజార్టీకి పది నుంచి 15 సీట్ల దూరంలో నిలిచిపోతాడని చెబుతున్నాయి. తాజాగా కొన్ని జాతీయ సంస్థలు తెలంగాణలో సర్వే చేయగా కేసీఆర్ పార్టీకి కేవలం 43-48 సీట్లు మాత్రమే వస్తాయని.. అటూ ఇటుగా చూస్తే 50 సీట్ల వరకూ మాత్రమే పెరిగే ఛాన్స్ ఉందని చెబుతున్నారు. రెండు సార్లు గెలిచిన వ్యతిరేకత వల్ల కేసీఆర్ మూడో సారి ఏకపక్షంగా విజయం సాధించలేరని సర్వేలో తేలింది. అయితే కేసీఆర్ కు సాయంగా ఇటు ఎంఐఎం పార్టీ 7 ఎమ్మెల్యే సీట్లతో ఆదుకునేందుకు రెడీగా ఉంది. ఒకరో ఇద్దరో ఇండిపెండెంట్లు ఎవరో ఒకరు గెలిస్తే ప్రభుత్వంలోకి తీసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కేసీఆర్ కు కావాల్సినంత స్కోప్ ఉంది.

ఇక ఇలా కాకుంటే మెజార్టీకి 20 సీట్ల దూరంలో అంటే 40 సీట్లు వచ్చినా కూడా కాంగ్రెస్ తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కేసీఆర్ మొహమాట పడడు. బీజేపీని ఓడించడానికి గద్దెనెక్కకుండా చేయడానికి కాంగ్రెస్ కూడా తప్పనిసరి పరిస్థితుల్లో కేసీఆర్ తో కలవక తప్పని పరిస్థితి. అలా ఎలా చూసుకున్నా వచ్చేసారి కేసీఆర్ దే గెలుపు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## భారాసతో మేం పొత్తు పెట్టుకోం: షర్మిల

హైదరాబాద్: భారాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో తెలంగాణను లిక్కర్ రాష్ట్రంగా మార్చారని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ (వైతెపా) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.70వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల ప్రతి ఒక్కరి తలపై రూ.లక్షన్నర అప్పు భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ గన్‌పార్కు వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించిన షర్మిల.. మీడియాతో మాట్లాడుతూ భారాస ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు షర్మిల 10 ప్రశ్నలు సంధించారు. ఆ




ప్రశ్నలకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. "అవినీతి సొమ్మంతా సీఎం కేసీఆర్ దగ్గరే ఉంది. ప్రజలకిచ్చిన అన్ని హామీలను సీఎం తుంగలో తొక్కారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. నా పార్టీని మరో పార్టీలో విలీనం చేస్తానని కొందరు మాట్లాడుతున్నారు. అలా మాట్లాడుతూ ఓ మహిళ కష్టాన్ని అవమానించొద్దు. అభ్యర్థులను తయారు చేసుకుని ఎన్నికల్లో పోటీకి నిలబెడతా. భారాసతో మేం ఎప్పటికీ పొత్తు పెట్టుకోం. పొత్తులపై భారాస, కాంగ్రెస్, భాజపా కూడా స్పష్టత ఇవ్వాలి. అప్పట్లో నేను చేరతానంటే కాదనే పార్టీ ఏదైనా ఉందా? వచ్చే ఎన్నికల్లో భారాసకు మెజారిటీ వచ్చే అవకాశం లేదు. ఎన్నికల తర్వాత భారాసతో పొత్తు ఉండబోదని కాంగ్రెస్ స్పష్టం చేయాలి" అని షర్మిల పేర్కొన్నారు.

## మీరే నా బలం.. మీరే నా బలగం.. మల్యాలలో మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట : మీరే నా బలం.. మీరే నా బలగం. మీ కోసం ఇంకా కష్టపడుతా.. మరింత సేవ చేస్తా. మీ ఆశీస్సులు, దీవెనలు, మీరిచ్చే బలం ఉన్నంత కాలం మీకు సేవ చేస్తూనే ఉంటానని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.

సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మల్యాల గ్రామంలో మంత్రి హరీశ్‌రావు గురువారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు జడ్పీ చైర్మన్ రోజాశర్మతో కలిసి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. మల్యాల గ్రామానికి గ్రామస్తుల సహకారంతో రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చింది. ఎటు వైపున చూసినా గ్రామ రూపురేఖలు మారిపోయాయని, గల్లీ, గల్లీలో సీసీరోడ్లు వేసుకున్నామని తెలిపారు.

**పుట్టబోయే బిడ్డకు న్యూట్రిషన్ కిట్.. పుట్టిన బిడ్డకు ఇచ్చేది కేసీఆర్ కిట్ :** మరో వారం రోజుల్లో గర్భిణీలకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందిస్తామని హరీశ్‌రావు తెలిపారు. పుట్టబోయే బిడ్డకు న్యూట్రిషన్ కిట్. పుట్టిన బిడ్డకు ఇచ్చేది కేసీఆర్ కిట్. ఇది కేసీఆర్‌కు ప్రజల మీద ఉన్న ప్రేమగా మంత్రి చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సీఎం కేసీఆర్ అయ్యాక అవ్వ, తాతల గౌరవం పెరిగింది అని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ రాకపోతే ఇంత అభివృద్ధి జరిగేదా అంటూ.. గత గ్రామ అనుభవాలు గుర్తు చేసి, ఇవాళ జరిగిన గ్రామ అభివృద్ధిని వివరించారు. కాళేశ్వరం నీళ్లతో మండుటెండలలో చెరువులు నిండు కుండలుగా తలపిస్తున్నాయని వివరించారు. ఎవ్వరైనా సరే సద్దితిన్న రేవు తలవాలని కోరారు. రూ.200 పింఛన్ రూ.2 వేలు చేశామని పేర్కొన్నారు.

**కాళేశ్వరంతో రెండు పంటలు.. :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బోర్లు వేసినా నీళ్లు పడక బాధపడ్డారని, తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ హయాంలో ఆ బాధ తప్పిందని, ప్రజలకు ఏం కావాలో ఆలోచన చేసి ఇచ్చే సంక్షేమ ప్రభుత్వం మనదని మంత్రి హరీశ్ వెల్లడించారు. గతంలో బోరు బావులు తవ్వి డబ్బులు వృథా చేసుకున్నారని, ఇవాళ కాళేశ్వరం నీటితో రెండు పంటలు పండించుకుంటున్నామని నాటి-నేటి పరిస్థితిని హరీశ్‌రావు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎరువుల కొరత ఉండేదని, కానీ ఇవాళ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక రైతుల కోసం 24 గంటల నిరంతర విద్యుత్, ఎరువులు తదితర రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం తలపెట్టిన అంశాలు వివరించారు. రోడ్డు



విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి అండగా ఉంటామని మంత్రి హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. మొదటి విడతలో 40-50 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామ లైబ్రరీకి వారంలో ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తానని హామీనిచ్చారు. గ్రామంలో 808 రైతులకు రైతుబంధు, అనివార్య కారణాలతో మృతి చెందిన 14 మంది రైతు కుటుంబాలకు రైతుభీమా ఇచ్చి ఆదుకున్నామని తెలిపారు. గ్రామంలో ఇటీవల శిక్షణ పొందిన 21 మందికి కుట్టు మిషన్లు త్వరలోనే అందిస్తామని మంత్రి హామీనిచ్చారు. అంతకుముందు 30 రోజుల ప్రణాళికతో మంత్రి సహకారంతో మల్యాల గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నామని గ్రామ ప్రజాప్రతినిధులు వివరించారు. గ్రామంలో 18 రకాల అభివృద్ధి పనులు చేసుకోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# మూడోసారి బీఆర్ఎస్‌దే అధికారం..

## 90-100 స్థానాల్లో ఈజీగా గెలుస్తాం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి కూడా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 90 నుంచి 100 స్థానాల్లో బీఆర్ఎస్ ఈజీగా గెలుస్తుంది.

మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు అని కేటీఆర్ పేర్కొన్నారు. మంచి ప్రదర్శన ఉన్న ఎమ్మెల్యేలందరికీ సీట్లు దక్కుతాయి. వెనుకబడిన ఎమ్మెల్యేలు తమ ప్రదర్శన మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఇతర రాష్ట్రాల్లో బీఆర్ఎస్ పోటీ.. :** బీఆర్ఎస్‌కు ఇతర రాష్ట్రాల్లో పోటీ చేసే దిశగా ఆలోచిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లోనూ మా పార్టీ కార్యక్రమాలు ప్రారంభించింది అని కేటీఆర్ తెలిపారు.

**సీఎం అభ్యర్థి ఎవరో చెప్పే దమ్ము ఉందా..? :** బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ సీఎం అభ్యర్థి ఎవరో చెప్పే దమ్ము ఉందా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఒక పార్టీ కాకుండా ఎన్జీవో, దుకాణాన్ని నడుపుకోవాలి. గుజరాత్‌లో ఎన్నికలు జరుగుతుంటే రాహుల్ పారిపోయాడు. పీవీ నరసింహారావును అవమానించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ధ్వజమెత్తారు.

**మోదీ ప్రభుత్వం గద్దె దిగాల్సిన అవసరం ఉంది.. :** మోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది అని కేటీఆర్ పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం గద్దె దిగాల్సిన అవసరం ఉంది. బీజేపీకి దమ్ముంటే దేశానికి చేసిన మంచి పనులు ఏంటో చెప్పాలి. నోట్ల రద్దుతో ఏం సాధించారో మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఇప్పుడు రూ. 2 వేల నోట్ల రద్దుతో సాధించింది ఏంటో కూడా చెప్పాలి అని డిమాండ్ చేశారు.

**లేని నిరుద్యోగం గురించి నిరసనలు.. :** రాష్ట్రంలో ప్రతిపక్షాలు.. లేని నిరుద్యోగం గురించి ఇక్కడ నిరసనలు చేస్తున్నారు.

మేం విదేశీ పర్యటనలు చేసి వేలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాం. తాజా పర్యటనతో 42 వేల మందికి ఉద్యోగ అవకాశాలు తీసుకొచ్చాం అని కేటీఆర్ తెలిపారు.

**నేషనల్ హైవే టెండర్ మాదిరే ఓఆర్ఆర్ టెండర్ :** ఓఆర్ఆర్ టెండర్ ప్రక్రియ నేషనల్ హైవే టెండర్ మాదిరే జరిగింది అని కేటీఆర్ తెలిపారు. ప్రతిపక్షాల ఆరోపణలపై మున్సిపల్ శాఖ ఏ విచారణకైనా సిద్ధమని ప్రకటించింది.

లీగల్ నోటీసులకు సమాధానం చెప్పాలి. చిల్లర మాటలు, ఆరోపణలు చేయడం ప్రతిపక్షాలు మానుకోవాలి అని కేటీఆర్ హెచ్చరించారు.

**ఎన్ని సీట్లలో పోటీ చేస్తారన్నది ఎంఐఎం ఇష్టం.. :** మైనార్టీలకు తెలంగాణ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను పక్క రాష్ట్రాల్లో పొగిడిన ఓవైసీ ఇక్కడ ఎందుకు విమర్శలు చేస్తున్నారు అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్ని సీట్లలో పోటీ చేస్తారన్నది ఎంఐఎం పార్టీ ఇష్టం.

ప్రజలు మత ప్రతిపాదికన ఓట్లు వేస్తారని నేను నమ్మను. మంచి ప్రభుత్వాన్ని మతాలకతీతంగా ఎన్నుకుంటారని నమ్ముతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.

**తెలంగాణలో బీజేపీ లేనే లేదు.. :** తెలంగాణలో బీజేపీ లేనే లేదు అని కేటీఆర్ తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలోనే బీజేపీ హంగామా అని ఆయన పేర్కొన్నారు.

**సౌత్ వర్సెస్ నార్త్ అనేది నా వాదన కాదు.. :** సౌత్ ఇండియా వర్సెస్ నార్త్ ఇండియా అనేది నా వాదన కాదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. జనాభా నియంత్రణ చేపట్టిన రాష్ట్రాలు నష్టపోకూడదన్నదే నా వాదన. ప్రజాస్వామ్యంలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు ఉండాలి. యూపీ లాంటి రాష్ట్రంలో పెరిగే సీట్ల మొత్తం దక్షిణాది రాష్ట్రాల సీట్ల కన్న ఎక్కువ.

దేశ ప్రగతికి మద్దతు ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోకూడదు. అలాంటి పరిస్థితి వస్తే ఎవరూ సహించరు. లోక్‌సభ స్థానాల పెంపుపై ఆరోగ్యవంతమైన చర్చ జరగాలని కేటీఆర్ సూచించారు.

**షర్మిల, కేఏ పాల్‌ది భ్రమ మాత్రమే.. :** రాష్ట్రంలో మాతో పోటీ పడే స్థితిలో కాంగ్రెస్ పార్టీ లేదు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ భ్రమల్లో ఉంది. రాష్ట్రంలో షర్మిల, కేఏ పాల్ అధికారంలోకి వస్తామని చెబుతున్నారు. వారిది కూడా భ్రమనే అని కేటీఆర్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## మోడీజీ పెట్టిన నిప్పు ఆ పార్టీలో ఇంకా ఆరలేదు!

విలక్షణ రాజకీయాలకు పెట్టింది పేరైన తమిళనాడులో అన్నాడీఎంకే అధినేత్రి అప్పటి ముఖ్యమంత్రి జయలలిత మరణించాక అధికారం కోసం జయ నమ్మిన బంటు పన్నీర్ సెల్వం జయ నెచ్చెలి శశికళ మధ్య ఫైట్ నడిచిన సంగతి తెలిసిందే. సందట్లో సడేమియాలా గోతి కాడ నక్కలాగా ఈ వివాదంలో తాను లాభపడటానికి వీలుంటే పన్నీర్ సెల్వంకు మద్దతిచ్చే ఎమ్మెల్యేలందరినీ బీజేపీలోకి లాగేసి బీజేపీ ప్రభుత్వాన్ని తమిళనాడులో ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ కలలు కన్నారని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో శశికళను అక్రమాస్తుల కేసులో జైలుకు పంపారని విమర్శలు ఉన్నాయి. అయితే శశికళ జైలుకు వెళ్లినా తన అనుంగు సహచరుడు పళనిస్వామి సీఎం అయ్యేలా చక్రంతిప్పారు. అయితే ఆ తర్వాత పరిణామాలతో పన్నీరు సెల్వం పళనిస్వామిల మధ్య బీజేపీ అధిష్టానం రాజీ ఫార్ములా తెచ్చి కలిపిందని వార్తలు వచ్చాయి. ఇందులో భాగంగా పళనిస్వామి సీఎంగా పన్నీరు సెల్వం డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అలాగే పార్టీకి పన్నీరు సెల్వం కన్వీనర్ గా పళనిస్వామి కోకన్వీన ర్ గా ఉండేలా ఒప్పందం కుదిర్చారని మీడియా సంస్థలు నాడు తెలిపాయి. అయితే గతేడాది జరిగిన తమిళనాడు ఎన్నికల్లో అన్నాడీఎంకే పరాజయం పాలై డీఎంకే అధికారంలోకి వచ్చింది. దీంతో స్టాలిన్ ముఖ్యమంత్రి అయ్యారు. అధికారం లేకపోవడంతో పార్టీపై పెత్తనం కోసం మళ్లీ పళనిస్వామి పన్నీర్ సెల్వం మధ్య ఆధిపత్య పోరు రాజుకుంది. ఇందులో భాగంగా ఎక్కువ మంది ఎమ్మెల్యేలు జిల్లాల పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు పళనిస్వామికే జై కొట్టారు. దీంతో పన్నీరు సెల్వాన్ని ఆయన కుమారుడు (ఎంపీ)తోపాటు పలువురిని పళనిస్వామి పార్టీ నుంచి బహిష్కరించారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ చెస్ ఒలంపియాడ్ ప్రారంభోత్సవం కోసం జులై 27న చెన్నైకు రానున్నారు. దీంతో నరేంద్ర మోదీతో భేటీ అయ్యేందుకు అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) బహిష్కృత నేత ఓ.పన్నీర్సెల్వం (ఓపీఎస్) ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ మేరకు వారు మోదీ అపాయింట్మెంట్ కోసం ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాశారని సమాచారం. అన్నాడీఎంకేలో నెలకొన్న సంక్షోభం దానిని అధిగమించి తాను బయటపడిన వైనం గురించి తెలియజేయడంతో పాటు తనకే ఆశీస్సులివ్వాలని మోదీని అభ్యర్థించేందుకు ఈపీఎస్ సిద్ధమైనట్లు తెలిసింది. మరోవైపు ద్వంద్వ నాయకత్వం కోసం కృషి చేసిన తనను పార్టీ నుంచి గెంటేసిన తీరును ఈపీఎస్ పోకడల్ని ఏకరువు పెట్టుకునేందుకు ఓపీఎస్ కూడా మోదీని కలవాలని ప్రయత్నిస్తున్నారు. నిజానికి మోదీ వీరిద్దరితోనూ సన్నిహితంగానే ఉన్నారు. అన్నాడీఎంకే సాధారణ సభ్య సమావేశంలో సమన్వయకర్తగా పన్నీరును తొలగించాక ఆయన ఢిల్లీ వెళ్లారు. ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ము నామినేషన్ కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. అప్పుడు కూడా బీజేపీ నేతలు ఆయన్ని సాదరంగానే ఆహ్వానించారు. అయితే మోదీ అమిత్షాలతో భేటీ కోసం చేసిన ప్రయత్నాలు మాత్రం విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు వీరిద్దరు ప్రధాని మోదీని కలవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయి ఎవరు విజయం సాధిస్తారన్నదానిపై రాజకీయవర్గాలు ఉత్కంఠతో గమనిస్తున్నాయి. మరోవైపు సందట్లో సడేమియా అన్నట్టు అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ కూడా మోదీని కలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. నిజానికి ఈపీఎస్ ఓపీఎస్ శశికళ దినకరన్ కలిసి వుంటేనే అన్నాడీఎంకేకు భవిష్యత్తు వుందని ముమ్ముందు ఆ పార్టీ మరింత బలపడుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తదితరులు గట్టిగా తలపోస్తున్నారు. ఆ మేరకు ఆయన ప్రయత్నాలు కూడా చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మోదీతో భేటీ అయ్యేందుకు అన్నామలై ద్వారా శశికళ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

# గడువు ముందర... పనుల్లో లేదు తొందర



సిరిసిల్ల : మెట్ట ప్రాంతమైన జిల్లాలోని వర్షపు నీటిని ఒడిసిపట్టి సాగుభూములన్నింటిని ఆయకట్టు పరిధిలోకి తీసుకురావాలనే లక్ష్యంతో వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మానేరు, మూలవాగుపై 58 కిలోమీటర్ల పొడవునా 24 చెక్‌డ్యాంలకు 2019లోనే రూ.142 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటికే 14 పూర్తయ్యాయి. మరో పది వివిధ దశల్లో ఉన్నాయి. భూగర్భ జలాలు పెరగడం ద్వారా వీటి పరిధిలో 30 వేల ఎకరాల్లో రెండు పంటలకు సాగునీటికి ఢోకా ఉండదు. గతేడాది జులై, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు చాలా చోట్ల పనులు ప్రారంభంలోనే నిలిచిపోయాయి. ఈ ప్రాంతాల్లో ఏప్రిల్, మే నెలల్లో పనులు ప్రారంభించారు. ఇప్పటికీ అసంపూర్తి దశలోనే ఉన్నాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారుల ఒప్పందం గడువు చాలా వరకు ఈ నెలాఖరుతో ముగుస్తుంది. వీటిలో చాలా వరకు రెండు, మూడు సార్లు పొడిగించారు. అసంపూర్తి నిర్మాణ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా దిగువకు చేరింది. జిల్లాలో చేపడుతున్న చెక్‌డ్యాం పనుల్లోనే అనేక లోపాలున్నాయనే విమర్శలున్నాయి. దీని కారణంగానే పనుల్లో జాప్యం జరుగుతోంది. 70 శాతం పైన నిర్మాణాలు పూర్తిచేసుకున్న చోట రెండేళ్లుగా వరదలకు ఇరువైపులా దెబ్బతిన్నాయి. ప్రతిపాదనల్లో చెక్‌డ్యాం వెనక, ముందు భాగంలో వరద ప్రవాహాన్ని తట్టుకునేలా మట్టి కట్టలు, బండరాళ్లతో రివిట్‌మెంటును నిర్మించాలనేవి లేవు. కేవలం సిమెంటు దిమ్మల నిర్మాణానికే పరిమితమయ్యారు. గతేడాది మానేరు, మూల వాగులో 30 వేల నుంచి 40 వేల క్యూసెక్కులకు పైన వరద వచ్చింది. ఈ భారీ వర్షాలను ఊహించలేకపోవడం... అన్ని చోట్ల ఒకే రకమైన డిజైన్లను అమలు చేయడంతో నిర్మాణం పూర్తయిన చోట వరద ప్రవాహాన్ని తట్టుకోవడం లేదు. సిరిసిల్లలోని సాయినగర్, కస్బేకట్కూరు, ఆవునూరు, మూలవాగుపై మామిడిపల్లి వద్ద వాగులు ఉద్ధృతంగా ప్రవహించడంతో చెక్‌డ్యాం సిమెంటు దిమ్మతో సహా కొట్టుకుపోయాయి. పక్కనున్న మట్టి కోతకు గురైంది. దీంతో సమీపంలోని పంట పొలాలకు నష్టం వాటిల్లింది. డ్యాంపై నుంచి ఎక్కువ విస్తీర్ణంలో వరద ప్రవహించడమే ఇందుకు కారణం. సాంకేతికంగా సరైన డిజైన్ చేశారా? వరదల సందర్భంలో ఎంత వచ్చే అవకాశం ఉంది, ఇందుకు తగిన విధంగా నిర్మాణాలు చేపట్టారా? అనే సందేహాలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. వీటిపై జలవనరులశాఖ అధికారులు మాత్రం అంచనాకు మించి వరద వచ్చిందని, గతంలో ఇలాంటి పరిస్థితి రాలేదని చెబుతున్నారు. భారీ వరదల నేపథ్యంలో చెక్‌డ్యాంల భద్రతపై దృష్టి సారించాల్సి ఉంది.

వరద తగ్గాక చేపడతాం– అమరేందర్‌రెడ్డి, ఈఈ, జలవనరులశాఖ
వాగుల్లో నీటి ప్రవాహం తగ్గాక పనులు పూర్తి చేస్తాం. దాదాపు అన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. అయిదు చోట్ల మాత్రం పునాది దశలో ఉన్నాయి. సకాలంలో పూర్తిచేయని గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం. చివరి దశలో ఉన్నవాటికి గడువు పొడిగించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం.

సాగదీత...దెబ్బతిన్న చెక్‌డ్యాంలకు మరమ్మతులు, అసంపూర్తి పనులను సాగదీస్తూ వస్తున్నారు. ఎగువమానేరు మత్తడి పారుతుండటంతో మానేరులో నీటి ప్రవాహం ఇంకా కొనసాగుతోంది. సిరిసిల్లలో సాయినగర్ వద్ద గతేడాది సిమెంటు దిమ్మ కొట్టుకుపోవడంతో పనులు అలాగే ఉన్నాయి. ఆవునూరు, కస్బేకట్కూరు, పదిర వద్ద పనులు ముందుకు సాగని పరిస్థితి ఉంది. ఈ పనులకు జులై, సెప్టెంబరుతో గడువు ముగుస్తుంది. మూలవాగుపై వెంకట్రావుపేట, మామిడిపల్లి, జయవరం, బొల్లారంలలో పనులు పునాది దశలోనే ఉన్నాయి. ఇక్కడ జూన్‌లోనే ఈ పనుల గడువు ముగిసింది. వరదలకు మళ్లీ పునాదుల్లోనే ఇసుక మేటలు వేసింది. ప్రస్తుతం రెండు వాగుల్లోనూ పనులు సాగలేని పరిస్థితి ఉంది. తిరిగి వర్షాకాలం పూర్తయి.. వరదలు తగ్గితే తప్పా పనులు ముందుకు సాగని పరిస్థితి. ఈ ఏడాది కూడా అసంపూర్తి పనులను పొడిగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇలా మూడేళ్లుగా పనులను పొడిగిస్తూ వస్తున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడటంలో వైఫల్యం కనిపిస్తోంది. కొన్ని చోట్ల గుత్తేదారులు పనులు వదిలేసినట్లు చెబుతున్నారు. దెబ్బతిన్న వాటికి కొత్తగా నిధులు మంజూరు కాలేదు. పాత గుత్తేదారులే చేస్తుండటంతో బిల్లులు వస్తాయా? లేదా? అనే సందేహంతో వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# ఉత్తర్వులతోనే సరిపెట్టారు



సిరిసిల్ల : అసలే గ్రామీణ ప్రాంతాలు... అందునా గిరిజన తండాలు... అత్యధికంగా పేద, బడుగు, బలహీనవర్గాల కుటుంబాలే ఉన్నాయి. పల్లె జనానికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలనే ఉద్దేశంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని భావించారు. ఇందుకు అనుగుణంగా ఇప్పుడున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) స్థాయికి పెంచుతున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఏళ్ల తరబడి ఇవి కాగితాలకే పరిమితం అవుతున్నాయి తప్పా అమలుకు నోచుకోలేదు. పెద్దాసుపత్రి తరహా వైద్య సేవలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు 24 గంటలూ వైద్య సేవలు అందని ద్రాక్షగా మారుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రంలోని సర్కారు దవాఖానాకు వెళ్లేందుకు వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తుంది. దూరాభారంతో తల్లడిల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు.

రెండు మండలాలకు ఒకే పీహెచ్‌సీ
ఎల్లారెడ్డిపేట మండలంలో 24 గ్రామాలు ఉండగా 46,270 మంది జనాభా ఉన్నారు. వీర్నపల్లి మండలంలో 17 గ్రామాల్లో 15,688 మంది జనాభా నివసిస్తున్నారు. ఈ రెండు మండలాలకు ఎల్లారెడ్డిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే పెద్ద దిక్కుగా మారింది. పీహెచ్‌సీ పరిధిలో 11 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా రాచర్ల బొప్పాపూర్, గర్జనపల్లి, వీర్నపల్లి ఉప కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. డాక్టర్ ధర్మనాయక్ మండల వైద్యాధికారిగా, డాక్టర్ స్రవంతి రాచర్ల బొప్పాపూర్ హెల్త్ వెల్‌నెస్ కేంద్రం ఎంఎల్‌హెచ్‌పీగా కొనసాగుతున్నారు. రెండు స్టాఫ్‌నర్సు, సీహెచ్‌ఓ పోస్టు ఖాళీగా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలంటే వీర్నపల్లి మండల కేంద్రం నుంచి 36 కిలోమీటర్లు, ఎల్లారెడ్డిపేట నుంచి 18 కిలోమీటర్లు, బండలింగంపల్లి నుంచి 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. అలాగే వీర్నపల్లి, బండలింగంపల్లి గ్రామాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేయగా స్థల సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

సీహెచ్‌సీగా మారితే...డైరెక్టర్ ఆఫ్ హెల్త్(డీహెచ్) కింద వచ్చే పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్య సేవలు అందుతున్నాయి. అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను నిత్యం చైతన్యపర్చడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, చిన్నారులకు టీకాలు, పల్స్‌పోలియో, కొవిడ్ నిర్ధారణ పరీక్షలు, కొవిడ్ వ్యాక్సినేషన్, గర్భిణులకు వైద్య పరీక్షలు తదితర సేవలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీని వైద్య విధాన పరిషత్ పరిధిలోని సీహెచ్‌సీగా మార్చితే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మాదిరిగా అన్ని రకాల చికిత్సలు పేదలకు అందుతాయి. నలుగురు ఎంబీబీఎస్ డాక్టర్లు, సర్జన్, గైనకాలజిస్టు, అనస్తీషియా, పిల్లల వైద్యుడు, దంతవైద్యుడు తదితర ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు గ్రామీణ ప్రజలకు మరింత చేరువ అవుతాయి. వీటితోపాటు పోస్టుమార్టం, ఎంఎల్‌సీ(మెడికో లీగల్ కేసులు) సేవలు సైతం అందుబాటులోకి వస్తాయి. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాల దృష్ట్యా బండలింగంపల్లి, వీర్నపల్లిలలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలతోపాటు ఎల్లారెడ్డిపేటలో సీహెచ్‌సీని ఏర్పాటు చేయాల్సి ఉంది. అన్ని వసతులతో కూడిన ఆసుపత్రి భవనాలను నిర్మించాలని, అధునాతన వైద్య పరికరాలను సమకూర్చాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారికంగా అప్పగించారు
– మురళీధర్‌రావు, సూపరింటెండెంట్, సిరిసిల్ల జిల్లా ప్రభుత్వాసుపత్రి
ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా స్థాయిని పెంచి, ఉన్న సిబ్బందితో నడిపించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు ఆ ఆసుపత్రులను అధికారికంగా వైద్య విధాన పరిషత్‌కు అప్పగించారు. 24 గంటలూ వైద్య సేవలను అందించాల్సి ఉంటుంది. వైద్య విధాన పరిషత్ నుంచి వైద్య నిపుణులు, సిబ్బంది కేటాయింపు జరగలేదు. డీహెచ్ పరిధిలో పని చేసేవారి సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించినా క్షేత్రస్థాయిలో ఆ పని సాధ్యం కాదు. భోజన సిబ్బంది, ప్రత్యేకంగా పారిశుద్ధ్య, సెక్యూరిటీ సిబ్బంది మంజూరవగా టెండర్లను పిలిచాం. సీహెచ్‌సీల నిర్వహణ ప్రారంభం కాకపోవడంతో గుత్తేదారులు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. మళ్లీ టెండర్లను ఆహ్వానిస్తాం.

2021–2022 ఆర్థిక సంవత్సరంలో ఎల్లారెడ్డిపేట పీహెచ్‌సీ పరిధిలో అందిన సేవలు
టీ హబ్ కన్సల్టేషన్: 796 టెలీమెడిసిన్ కన్సల్టేషన్: 835 మధుమేహం రోగులకు: 507 ఓపీ సేవలు: 25,694 సాధారణ ప్రసవాలు: 885 బీపీ బాధితులకు చికిత్స: 781 18 ఏళ్లు నిండిన వారికి కొవిడ్ వ్యాక్సినేషన్: 38,451

# రీచ్‌ల మూత.. ధరల మోత

కరీంనగర్ : ఇసుక అక్రమ అక్రమ రవాణాను అరికట్టడం, స్థానిక అవసరాలకు, నిర్మాణాలకు సులభతరంగా తక్కువ ధరకు ఇసుక అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మన ఇసుక వాహనం అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైఫట్‌ను రూపొందించింది. ఇందులో ట్రాక్టరు యజమానులు తమ వాహనాలను రిజిస్టర్ చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మన ఇసుక వాహనం కోసం 13 రీచ్‌లను గుర్తించారు. ప్రస్తుతం ఆరింటిలో మాత్రమే తవ్వకాలు జరుగుతున్నాయి. మనం ఏదైతే రీచ్ నుంచి ఇసుకను బుక్ చేసుకుంటామో అక్కడి నుంచి ట్రాక్టర్లతో ఇంటి వద్దకు చేర్చుతారు. అటు వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక లభించడంతో పాటు వాహన యజమానులు, కార్మికులకు ఉపాధి లభిస్తుంది.

ప్రజల అవసరాలే ఆసరాగా..ఇసుక కోసం మన ఇసుక వాహనం అంతర్జాలంలో వందలాది మంది బుక్ చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ నెల 9 నుంచి చేగుర్తి, లింగాపూర్, శ్రీనివాసనగర్, ఖాజీపూర్, వెల్ది, రామంచల్లో ఇసుక రీచ్‌ల్లోకి నీరు చేరడంతో క్వారీలు మూతపడ్డాయి. ఖాజీపూర్ రీచ్ మాత్రం ఈ నెల 11న నడిచినట్లు అధికారులు తెలిపారు. భవన, ఇతర నిర్మాణాలు నిలిచి పోయాయి. ఇది అక్రమార్కులకు వరంగా మారింది. ట్రాక్టరు ఇసుకను రూ.3500పైగా అమ్ముతున్నట్లు పలువులు తెలిపారు. ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకున్న అక్రమ ఇసుక వ్యాపారులు అందినకాడికి దండుకుంటున్నారే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న రీచ్‌లకు సంబంధించి ఇప్పటి వరకు 1200 బుకింగ్ పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెప్పారు. తాత్కాలికంగా బుకింగ్‌ను నిలిపివేసినట్లు సమాచారం. వర్షాలు కురవకపోతే రెండు నుంచి మూడు రోజుల్లో క్వారీలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ముందస్తుగా..కొందరు ఇసుక అక్రమ వ్యాపారులు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఏప్రిల్, మే నెలలో మానేరు నదీ పరీవాహక ప్రాంతాలు, చెరువులు, కుంటల నుంచి ఇసుక తీసుకుని నిల్వ చేస్తుంటారు. వానలు కురిసి నదీ పరీవాహక ప్రాంతాల్లోకి నీరు చేరితే ఇసుక తరలించడం సాధ్యంకాదు. ఇలాంటి సందర్భాల్లో ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ వ్యాపారాన్ని అరికట్టడానికి భూగర్భగనుల శాఖ, పోలీసు యంత్రాంగం కట్టడి చేస్తున్నా కొందరు ఇసుక నిల్వ చేస్తున్నారు. రెండు నెలల క్రితం హౌసింగ్‌బోర్డుకాలనీలో నిల్వఉన్న ఇసుక డంపులను కమిషనరేట్ పోలీసులు గుర్తించి సంబంధిత శాఖల అధికారులకు అప్పగించారు.

త్వరలోనే అందుబాటులోకి– సత్యనారాయణ, సహాయ సంచాలకులు, భూగర్భగనుల శాఖ, కరీంనగర్
ఇటీవల భారీ వర్షాలు పడటంతో నీరు చేరి క్వారీలు మూతపడ్డాయి. ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. వానలు పడకుండా ఉంటే రెండు నుంచి మూడు రోజుల్లో రీచ్‌లు అందుబాటులోకి వస్తాయి. బుక్ చేసుకున్న వారికి క్రమపద్ధతిలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేస్తారు.

# అందరికీ అందుబాటులో సార్వత్రిక విద్య

ఖమ్మం : ఆర్థిక, సామాజిక పరిస్థితులతో బాల్యంలో చదువుకు దూరమైన వారికి రాష్ట్ర ప్రభుత్వం సార్వత్రిక విద్య (ఓపెన్ స్కూల్) అమలు చేస్తోంది. ప్రత్యేక అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేసి దూరవిద్య బోధిస్తున్నారు. ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 18 నుంచి ఆగస్టు 14 (అపరాధ రుసుంతో 30 వరకు) మధ్య అవకాశం కల్పిస్తున్నారు. పాఠశాల స్థాయిలో కీలకమైన పదో తరగతి, ఇంటర్మీడియట్ చదవనివారు, మధ్యలోనే ఆపేసిన వారు ప్రవేశాలు పొందవచ్చు గ్రామీణ ప్రాంతాల వారు, ఉద్యోగులు, ప్రైవేటు రంగాల్లో పనిచేసేవారు తమ పనులు చేసుకుంటూనే సెలవు దినాల్లో చదువుకోవచ్చు 'తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్' ద్వారా ప్రవేశాల దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 53 అధ్యయన కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 30, 2022 నాటికి 14 ఏళ్లు నిండినవారు... బడి మధ్యలో మానేసిన వారు



ప్రవేశాలు పొందేందుకు అర్హులు. బోధన తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ మాధ్యమాల్లో జరుగుతుంది. వృత్తి విద్య కోర్సులను ఐచ్ఛిక సబ్జెక్టుగా ఎంపిక చేసుకునే వీలుంది. ధ్రువపత్రాలకు రెగ్యులర్ కోర్సులతో సమానంగా ప్రాధాన్యం ఉంటుంది.'ఓపెన్ స్కూల్ ద్వారా విద్యార్హతలు పెంచుకునేందుకు వేలాది మంది ముందుకొస్తున్నారు. చదువు మధ్యలో మానేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉన్నత చదువులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం విద్యార్హతలను పెంచుకోవచ్చు ఆసక్తి గలవారు అందుబాటులో ఉన్న సమీప అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలి.' – మద్దినేని పాపారావు, ఓపెన్ స్కూల్ ఉభయ జిల్లాల బాధ్యుడు

# పారిశుద్ధ్యం..శరవేగం

భద్రాచలం : గోదావరి శాంతించడంతో పారిశుద్ధ్య పనులు వేగం పుంజుకుంటున్నాయి. పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్న నిర్వాసితులు ఇంటి పరిసరాలను, సామగ్రిని శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మోకాలి లోతు పేరుకుపోయిన ఒండ్రుమట్టి, బురదలో కూరుకుపోయిన సామగ్రిని కడుక్కుంటున్నారు. జిల్లావ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక సిబ్బంది, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. రహదారులపై బురద మేటలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పునరావాస కేంద్రాల్లో భోజనాలు చేసిన తర్వాత బాధితులు ఇళ్లకు వెళ్లి పరిసరాలను శుభ్రం చేసుకుని మళ్లీ వచ్చి ఇక్కడే సేదదీరుతున్నారు. దాతలు తమ ఔదార్యాన్ని చాటుతున్నారు. భద్రాచలం రామాలయం పరిసరాల్లో వరద నీరు తగ్గుతోంది. విస్తా కాంప్లెక్స్ నుంచి అన్నదాన సత్రం వరకు నీరు లేకుండా చేయాలంటే ఇంకొంత సమయం ఆగక తప్పదు. ప్రత్యేక మోటార్లతో తిరుగు జలాలు తోడుతున్నా పూర్తిస్థాయిలో రాకపోకలకు అందుబాటులోకి రాలేదు.

ఈ వాహనాలు ప్రత్యేకం..మురుగు కన్పిస్తే చాలు పని పట్టేందుకు మానిటో వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. వీటిని వాడుక భాషలో బాప్‌కాట్ యంత్రాలని మున్సిపాల్ సిబ్బంది పిలుస్తున్నారు. బురదను, చెత్తను త్వరగా ఎత్తివేస్తు ముందుకు కదులుతున్నాయి. హైదరాబాద్ జీహెచ్‌ఎంసీలో మాత్రమే ఉండే వీటిని ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవతో భద్రాచలం రప్పించారు. ఒక్క వాహనం ఖరీదు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఉంటుందని సిబ్బంది తెలిపారు. జేసీబీ తరహాలో కనిపిస్తున్న ఇవి దూకుడుగా పని చేస్తున్నాయి. నీటిలో ఉన్న చెత్తా చెదారాన్ని, బురదను కార్మికులు ఒక దగ్గర కుప్పపోసిన వెంటనే పెద్ద బకెట్ కలిగిన ఈ యత్రం క్షణాల్లో లోడింగ్ చేసుకుని చెత్తను తరలించే వాహనంలో ఎత్తిపోస్తుంది. ఇలాంటి వాటిని శాశ్వత ప్రాతిపదికన భద్రాచలం గ్రామ పంచాయతీకి కేటాయించాలని కోరుతున్నారు.

తికమక సర్వేలతో ఆందోళన
భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాలకు చెందిన 45 గ్రామ పంచాయతీలు ముంపుబారిన పడ్డాయి. 12,277 ఇళ్లు నీట మునిగాయి. బాధిత కుటుంబాలను గుర్తించే ప్రక్రియ 7 మండలాల్లో సాగుతుండగా సర్వేల్లో తికమక చోటుచేసుకుంటోంది. ఎవరు అసలైన లబ్ధిదారులో తేల్చడంలో గందరగోళానికి గురవుతున్నారు. ముంపు సమయంలో పునరావాస కేంద్రాలకు వెళ్లిన వారికి నిత్యావసర సరకుల కిట్లు అందిస్తున్నారు.



కొందరికి జాబితాలో పేరు లేదనే కారణంతో ఇవ్వడం లేదు. ఆసుపత్రుల్లో చేరి ఇంటికి దూరంగా ఉన్నవారిని బాధితులుగా గుర్తించడం లేదు. ఒకే ఇంటిలో రెండు మూడు కుటుంబాలు ఉంటే అందరినీ ఒకే కుటుంబంగా గుర్తిస్తున్నారు. బూర్గంపాడు, భద్రాచలం మండలాల్లో ఈ తరహా సమస్య తీవ్రంగా ఉంది. సర్వే బృందాలు వెళ్లినప్పుడు బాధితులు అందుబాటులో లేకపోతే పేర్లు రాయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ నాయకుల ప్రమేయం పెచ్చుమీరుతున్నందున ఆందోళనలు రెట్టింపవుతున్నాయి. అధికార పార్టీ నాయకులు చెప్పిన వారి పేర్లనే నమోదు చేస్తున్నారనే విమర్శలు ఉన్నందున ఈ అంశంపై దృష్టి సారించాలని వేడుకుంటున్నారు.

గోదావరి దోబూచులాట
ఉదయం 5 గంటలకు 47.9 అడుగులకు వరద తగ్గింది. వాస్తవంగా 48 అడుగుల కన్నా నీటి మట్టం తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించాల్సి ఉన్నప్పటికీ ఆ పని చేయలేదు. ఎగువ ప్రాంతం నుంచి ఇంకొంత వరద వస్తుందనే సమాచారంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 7 గంటలకు 47.8 అడుగులు, 10 గంటలకు 47.7 అడుగులకు తగ్గింది. ఆ తర్వాత నుంచి నిదానంగా పెరుగుదల కన్పించింది. మధ్యాహ్నం 12 గంటలకు 47.8 అడుగులకు చేరింది. రాత్రి 11 గంటలకు 48.60 అడుగులకు పెరిగింది. వరద పెరుగుదల స్థానికులను ఒకింత ఆందోళనకు గురి చేస్తోంది.

# ఉత్తమ బోధన.. టాస్క్ శిక్షణ

వేములవాడ : నాణ్యమైన విద్యా బోధన, మౌలిక వసతులు, టాస్క్ శిక్షణతో సాధిస్తున్న ఉత్తమ ఫలితాలే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు తెచ్చిపెట్టాయి. వేములవాడ– సిరిసిల్ల పట్టణాల మధ్య అగ్రహారంలో 1979లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో స్థాపించిన మొట్ట మొదటి శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దింది. ఇక్కడ విద్యనభ్యసించిన వేలాది మంది విద్యార్థులు ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. చాలా మంది పూర్వ విద్యార్థులు వివిధ దేశాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ ఏటా వివిధ కోర్సుల్లో 420 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశం ఉంది. నిత్యం విద్యార్థులతో కళకళలాడుతూ, ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

**అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు**

పూర్వ విద్యార్థులు, దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నవారు కళాశాల అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నారు. కళాశాలలో అయిదు విభాగాల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఏటా రూ.5 వేల చొప్పున నగదు అందజేస్తున్నారు. పూర్వ విద్యార్థులు తమ ఉన్నత విద్యలో, ఉపాధి పొందడంలో, ఉద్యోగాల్లో తమ అనుభవాన్ని కళాశాల ఏర్పాటు చేసిన వేదిక 'అలుమ్ని టాక్స్' కార్యక్రమం ద్వారా ప్రస్తుత విద్యార్థులకు వివరిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

**నిపుణులైన అధ్యాపకులు...**




కళాశాలలో వివిధ సబ్జెక్టుల్లో 80 మంది నిపుణులైన అధ్యాపకులు ఉన్నారు. వీరు విద్యా బోధన చేస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. కొత్త ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌బీఏ నిపుణులు నలుగురు మార్చి 24 నుంచి 26 వరకు సందర్శించారు. కళాశాలలోని వాతావరణం, మౌలిక వసతులు, ప్రయోగశాలలు, విద్యా బోధన, బాలురు, బాలికలకు వసతి గృహాలు, విద్యా ప్రమాణాలు, టాస్క్ శిక్షణ, ఉత్తీర్ణత శాతం, ఉద్యోగ కల్పన, ప్రాంగణ నియామకాలు, అదనపు బోధన ప్రణాళికలు, పూర్వ విద్యార్థుల సంఘం అందిస్తున్న సహాయ సహకారాలు వంటి పలు అంశాలను బృందం పరిశీలించింది. వాటన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఉత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందున కళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఎన్‌బీఏ గుర్తింపు పొందిన ఈ పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన వారికి ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడటానికి అవకాశం ఉంటుంది.

**కోర్సులు ఇవీ...**

అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమోలో 120 సీట్లు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ విభాగంలో 120, మెకానికల్ విభాగంలో 60, టెక్స్‌టైల్ విభాగంలో 60, కంప్యూటర్, కమర్షియల్ ప్రాక్టీస్ విభాగంలో 60 సీట్లు మొత్తం 420 సీట్లు ఉన్నాయి. ఆయా కోర్సుల్లో పాలిసెట్ ద్వారా అర్హత పొందిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తుంటారు.

**అందరి సహకారంతోనే ఎన్‌బీఏ గుర్తింపు**

కళాశాలకు అందరి సహకారంతోనే ఎన్‌బీఏ గుర్తింపు లభించింది. ఉత్తమ బోధన, ఫలితాలు, విద్యార్థుల ప్రవేశాలు, మౌలిక సదుపాయాలు, ఇక్కడ నిర్వహించే అన్ని కార్యక్రమాలు ఇతర కళాశాలల కంటే ఉత్తమంగా ఉండటంతో ఎన్‌బీఏ గుర్తింపు వచ్చింది. అనేక అంశాలపై కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నాం. తక్కువ ఖర్చుతో తెలంగాణలోని అత్యుత్తమ ఇంజినీరింగ్ కళాశాలల్లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశాలు పొందడానికి, స్వయం ఉపాధికి అవకాశం ఉంది. ఇంటర్ ద్వారా ఇంజినీరింగ్ చేసిన విద్యార్థుల కంటే పాలిటెక్నిక్ ద్వారా ఇంజినీరింగ్ చేసిన వారిలో ప్రాక్టికల్స్ పరిజ్ఞానం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ఎక్కువగా ఉండటంతో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉండటానికి అవకాశం ఉంటుంది. బి.రాజగోపాల్, ప్రిన్సిపల్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అగ్రహారం

# వసూళ్లకు సహకారం!

కరీంనగర్ : క్రమబద్ధీకరణకు వేచి చూస్తున్న ఒప్పంద సిబ్బంది అవసరాన్ని అవకాశంగా మలచుకున్నారు. నిబంధనలకు అనుగుణంగా అర్హులైనా డబ్బులు ఇవ్వాల్సిందే అని అందినకాడికి దండుకున్నారు.. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పని చేస్తున్న వారి నుంచి వసూళ్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా ఆరా తీస్తున్నారు.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పని తీరు, సంస్థ బలోపేతానికి వారి కృషి వివరాలు కోరగా గతేడాది డిసెంబరులోనే సహకార శాఖ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. వారిని ఇటీవల క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ నివేదిక పంపించడానికి ప్రతి ఉద్యోగి నుంచి రూ.5 వేల చొప్పున వసూలు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నివేదిక తయారీ సమయంలోనే ఆ శాఖ ఉద్యోగులు సంబంధిత ఒప్పంద సిబ్బందికి తమ నివేదికనే ప్రామాణికం అని స్పష్టం చేసి డబ్బులు ఇవ్వాల్సిందే అని పేర్కొన్నట్లు తెలుస్తోంది. చాలా మంది అప్పుడే వారి కోరిన మొత్తం ఇవ్వగా.. కొన్ని లొసుగులు ఉన్నవారు ఎక్కువ మొత్తంలో ఇచ్చినట్లు సమాచారం. కొంతమంది మాత్రం తరువాత ఇస్తామనడంతో అప్పటికి ఊరుకున్న వసూలు బృందం క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తయి వచ్చే నెల నుంచి పూర్తిస్థాయి వేతనాలు రానుండటంతో ఇటీవల ఒత్తిడి పెంచగా వారు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జీవోలో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగానూ ఇద్దరు ముగ్గురిని క్రమబద్ధీకరించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వసూళ్ల విషయం రాష్ట్రస్థాయి అధికారులకు ఇటీవలే తెలియడంతో ఆరా తీసినట్లు సమాచారం. రాష్ట్రస్థాయి నుంచి వచ్చిన ఓ అధికారి ఇటీవల కొన్ని సంఘాల పరిధిలోని సిబ్బందిని విచారించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ మొత్తం వ్యవహారంలో వసూళ్ల పర్వానికి తెరతీసిన సహకార శాఖ ఉద్యోగులు చాకచక్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. తమ పేరెక్కడా బయట పడకుండా కింది స్థాయి సిబ్బందితో వసూళ్లు చేయించినట్లు సమాచారం.

# ఔత్సాహికులకు ప్రోత్సాహం



హనుమకొండ : ఉన్నత విద్య అభ్యసించి పారిశ్రామిక రంగంలో రాణించాలనుకునే యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా చేయూతనిస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వారికి ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ప్రవేశ పెట్టారు. దీని ద్వారా సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు అవకాశం కల్పిస్తూ.. బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు చేసి యువతకు తోడ్పాటు అందిస్తున్నారు. జిల్లా పరిశ్రమల శాఖ, ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్, ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. జిల్లాలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమల శాఖకు 248 దరఖాస్తులు రాగా, అందులో 156 దరఖాస్తులను బ్యాంకులకు పంపించారు. వీటిలో 64 మందికి రుణాలు మంజూరుకాగా, రూ.1.44కోట్లు రాయితీ అందింది. 2022–23లో 462 దరఖాస్తులను పరిశీలించి 373 దరఖాస్తులను బ్యాంకులకు పంపించారు. వాటిలో ఇప్పటి వరకు 102 మందికి రుణాలు మంజూరయ్యాయి. వీరికి రూ3.79 కోట్లు రాయితీ అందింది. ఈ రెండేళ్లలో బ్యాంకుల నుంచి మొత్తం 166 మందికి రుణాలు అందాయి. ప్రభుత్వం నుంచి రాయితీ కింద రూ.5.23 కోట్లు వచ్చింది. వ్యవసాయం, సేవలు, మినరల్ వాటర్, నిర్మాణరంగ ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలకు ఆదరణ బాగుందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసుకుంటే ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. తీసుకున్న రుణాన్ని మూడు నుంచి ఏడేళ్లలోపు చెల్లించవచ్చు. ఈ పథకంపై పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

**కావాల్సిన అర్హతలు**

18 నుంచి 60 ఏళ్లలోపు ఉండాలి.
కనీస విద్యార్హత 8వ తరగతి.
ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి.
పారిశ్రామిక రంగానికి రూ.10 లక్షలు, సేవా రంగానికి రూ.5 లక్షలు.
ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీ, దివ్యాంగులు, మహిళలు 5 శాతం, జనరల్ అభ్యర్థులు 10 శాతం తొలుత పెట్టుబడి వ్యయంగా చెల్లించాల్సి ఉంటుంది.
గ్రామీణ ప్రాంతాల్లో జనరల్ అభ్యర్థులకు 25 శాతం, పట్టణ ప్రాంతాల్లో 15 శాతం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం, పట్టణ ప్రాంతంలో 25 శాతం రాయితీ అందజేస్తారు.

**లక్ష్యానికి మించి రుణాలిస్తున్నాం– హరిప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్**

ఏటా నిర్దేశించిన లక్ష్యానికంటే అదనంగా రుణాలు అందజేస్తున్నాం. బ్యాంకులను సమన్వయం చేసి సమస్యలుంటే పరిష్కరిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను పారిశ్రామిక రంగం వైపు ప్రోత్సహించేందుకే ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. అర్హత కల్గినవారు దరఖాస్తు చేసుకోవాలి. నిర్మాణ రంగానికి అధిక ప్రాధాన్యత ఉన్నందున ఆ రంగం దిశగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుంది.

# సింగరేణి.. 'జల'సిరులవేణి



హనుమకొండ : బొగ్గు వెలికితీతలో భాగంగా భూగర్భంలో వందల మీటర్ల లోతులో ఉన్న పాతాళ గంగను సింగరేణి పైకి తీసుకొస్తోంది. పదుల సంఖ్యలో కుంటలు, చెరువులను నీటితో నింపుతోంది. ఆ నీటితో బీడు భూములను సస్యశ్యామలం చేస్తూ రైతులకు సిరుల పంట పండిస్తోంది. జీవనోపాధి పొందడానికి చేయూతనిస్తోంది. ప్రకృతి పరవశించేలా, పశుపక్ష్యాదులు పర్యటించేలా జల సిరులను ఒడిసిపడుతూ కుంటలకు జలకళ తెస్తోంది. ఫలితంగా సింగరేణి విస్తరించి ఉన్న ప్రాంతాల్లోని బోర్లలో, చేదబావుల్లో పదుల మీటర్ల లోతులోనే నీరు లభించడం విశేషం.

వృథా చేయకుండా..జాతీయ సంపదైన బొగ్గును భూ గర్భం నుంచి వెలికితీయడం సింగరేణి కర్తవ్యం.. ఈ క్రమంలో గనుల్లో ఊటల ద్వారా ఉత్పన్నమవుతున్న నీటిని భారీ మోటార్లతో తోడుతూ గని ఉపరితలంలో ఎక్కడో ఒకచోట వదలడంతో ఆ నీరు వృథాగా పోయేది. ఈ నీరు ఎందుకు ఇలా కావాలి..? నీటి బొట్టును సంరక్షించి.. వ్యవసాయానికి అందించాలనే సంకల్పంతో సింగరేణి యాజమాన్యం దాదాపు దశాబ్దకాలంగా జల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ వందలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తోంది.

**పచ్చని పంట పొలాలు**

దశాబ్దం క్రితం వర్షాధారంతో అరకొరగా పంటలు పండించిన కర్షకులు.. కాలం కోసం ఎదురుచూడకుండా పంటలు పండించేందుకు పుష్కలమైన జలాన్ని సింగరేణి అందిస్తోంది. భూగర్భ, ఉపరితల గనుల నుంచి రోజుకు వందల గ్యాలన్ల నీటిని బయటకు తోడుతుండటంతో ఈ నీటిని రైతులు సాగుకు మళ్లించుకుంటున్నారు. ఫలితంగా సింగరేణి ఏరియాల్లో ప్రధానంగా ప్రభావిత గ్రామాల్లోని బీడు భూములు సస్యశ్యామలమై వరి దిగుబడి పెరిగింది. ఏరియాలోని కేటీకే 1వ గని, కేటీకే ఉపరితల గని–2, కేటీకే యైటింక్లైన్ గనుల నుంచి వచ్చే నీటితో సెగ్గంపల్లి, గడ్డిగానిపల్లి, బస్వరాజుపల్లి శివార్లలో దాదాపు 316 ఎకరాల భూముల వరకు రెండు పంటలు సాగులోకి వచ్చాయి.

**కాల్వ ద్వారా పంపుతున్నాం..– బళ్లారి శ్రీనివాసరావు, సింగరేణి జీఎం**

బొగ్గు గనుల నుంచి తోడుతున్న నీటిని వృథా చేయకూడదనేది కంపెనీ ఆలోచన. అందుకు బావుల ద్వారా వచ్చే జలాన్ని కాల్వలు, చిన్న కుంటల ద్వారా పంట పొలాలకు అందిస్తున్నాం. వర్షాకాల, యాసంగి పంటలు పండుతున్నాయి. ఇతర పంటలకు కూడా నీరు అందుతోంది. ప్రభావిత ప్రాంతవాసులకు వనరులు ఎంతో దోహదపడుతున్నాయి.

# అంగన్‌వాడీ గుడ్లపై ప్రత్యేక ముద్ర

జనగామ : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేయాల్సిన కోడి గుడ్లు పక్కదారి పడుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం దీన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. జూన్ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గుడ్ల పంపిణీ ప్రక్రియలో వినూత్న మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇందులో భాగంగా ప్రతి గుడ్డుపై ప్రత్యేక ముద్ర వేసి అందిస్తారు. దీంతో ఈ గుడ్లు ఎక్కడ కనిపించినా అధికారులు గుర్తించే అవకాశం ఉంటుంది.

**ఇప్పటి వరకు ఇలా..**

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతల వివరాలను ఇప్పటికే నమోదు చేశారు. వాటి ఆధారంగా వీరికి గుడ్లు సరఫరా చేస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల వయసున్న పిల్లలకు నెలకు 16.. గర్భిణులు, బాలింతలకు రోజుకొకటి చొప్పున గుడ్లను అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పాఠశాలలోనే ఉడికించి పెడుతున్నారు. వివిధ కారణాలతో కొందరు మహిళలు స్థానికంగా లేకపోయినా.. వారికి గుడ్లు అందజేసినట్లుగా రికార్డుల్లో రాసుకొని కొందరు సిబ్బంది దారి మళ్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

**ఇక నుంచి..**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే గుడ్లపై 'అంగన్‌వాడీ గుడ్లు... తెలంగాణ ప్రభుత్వం' అని ముద్రవేసి, సంబంధిత జోన్ నెంబర్‌ను కూడా పేర్కొంటారు. గుడ్లు పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టనున్నారు. జులై నుంచి ఫిబ్రవరి వరకు రెగ్యులర్ నెలల కాలంలో నెలకు రెండు తడవలుగా గుడ్లు అందిస్తారు. మార్చి నుంచి జూన్ వరకు వేసవిలో గుడ్లు త్వరగా చెడిపోయే ప్రమాదం ఉండడంతో నెలకు మూడు తడవల్లో సరఫరా చేస్తారు. వేసవిలో అందించే మొదటి బ్యాచ్ గుడ్లపై నీలం రంగులో, రెండో బ్యాచ్ గుడ్లపై ఎరుపు రంగు,




మూడో బ్యాచ్ గుడ్లపై ఆకుపచ్చ రంగులో ముద్రవేసి పంపిణీ చేస్తారు. సాధారణ కాలంలో మొదటి వారంలో అందించే గుడ్లపై నీలం రంగు, రెండో విడతలో ఎరుపు రంగు ముద్ర వేస్తారు. మధ్యలో పేర్కొనే జోన్ నెంబరు స్పష్టంగా కనిపించేలా 5 మి.మి. పొడవు, వెడల్పులతో ఉండాలని ప్రభుత్వం నిర్దేశించింది.

**అక్రమాలకు అడ్డుకట్ట**

ప్రభుత్వ ముద్ర ఉన్న గుడ్లను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, ఇతరులు భయపడతారు. పొరపాటున అధికారులో, ప్రజలో వీటిని గుర్తిస్తే అవమానంతో పాటు, శిక్షలు తీవ్రంగా ఉంటాయని కొనుగోలు చేయడానికి జంకుతారు. దీంతో అక్రమ రవాణా, వినియోగాన్ని ప్రాథమిక దశలోనే కట్టడి చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ గుడ్లను కమోడిటీ సప్లయ్ ట్రాకింగ్ సిస్టం ద్వారా బ్యాచుల వారీగా సరఫరా చేయనున్నారు.

# తాగునీటి పథకాల విస్తరణకు అమృత్

కరీంనగర్ :ఉమ్మడి జిల్లా పరిధిలోని 14 పురపాలకలు, రెండు నగర పాలికలు ఉండగా అమృత్ 2.0 పథకం కింద 15 మున్సిపాలిటీలకు ప్రాధాన్యమిచ్చి తాగునీటి సరఫరా పథకాలను విస్తరించేలా చర్యలు చేపట్టారు. వీటి పరిధిలో సమీప గ్రామాలను విలీనం చేయడం, కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడంతో తాగునీటి వసతి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆయా పుర, నగర పాలికలు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించడంతో ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు పరిపాలన మంజూరు ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా, 15వ ఆర్థిక సంఘం నిధులు, మున్సిపాలిటీ వాటాతో నిధులు రానున్నాయి. పరిపాలన అనుమతి లభించడంతో ప్యాకేజీల వారీగా టెండర్లు పిలిచే అవకాశముంది.

**పొంతన లేకుండా నీటి సరఫరా**

ప్రస్తుతం మున్సిపాలిటీల్లో, విలీన కాలనీల్లో రూరల్ మిషన్ భగీరథ పథకం కింద తాగునీరు సరఫరా చేస్తుండగా అదీ ఏ మూలకు సరిపోవడం లేదు. పైగా ఏ సమయంలో వస్తుందో తెలియని గందరగోళం ఉంది. జనాభా, నీటి అవసరాలకు అనుగుణంగా డిజైన్లు లేకపోవడమే ప్రధాన లోపంగా మారింది. కరీంనగర్‌లోని విలీన కాలనీల్లో అయితే రూరల్ మిషన్ భగీరథ పనుల కారణంగా తాగునీటి వ్యవస్థ దారుణంగా మారింది. గంటల తరబడి ట్యాంకులు నిండుతుండగా సమయపాలన లేకుండా పోయింది. నగర పాలికనే



స్వయంగా ప్రధాన పైపులైను విస్తరించి తాగునీటి వసతి కల్పించే పరిస్థితి ఏర్పడింది.

**తీరనున్న దాహం**

కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, విలీన కాలనీల్లో తాగునీటి అవసరాలు తీర్చడానికి నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాయి. పంచాయతీల సమయంలో ఏవిధంగా సరఫరా చేస్తున్నారో అలాగే శుద్ధి నీరు పంపిణీ చేస్తుండగా కొత్త పురపాలికలు, విలీన కాలనీల ప్రజలు ఎండాకాలంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో పైపులైన్ల విస్తరణ, రిజర్వాయర్లు లేకపోవడం, జనాభా ప్రాతిపదికన, భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా నీటి సామర్థ్యం పెంచకపోవడమే సమస్యగా మారింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద నిధులు విడుదల చేసేందుకు ముందుకు రావడంతో ఆయా పట్టణవాసులకు ఊరట కలగనుంది.

**రెండో ప్యాకేజీలో రూ.516.45 కోట్లు**

అమృత్ పథకంలో తాగునీటి సరఫరా మెరుగు పర్చేందుకు 15 మున్సిపాలిటీలను రెండో ప్యాకేజీలో చేర్చారు. ఈ ప్యాకేజీలో రూ.516.45 కోట్లు కేటాయించారు. ఈ నిధుల్లో పురపాలికల వాటా మొత్తం రూ.52.15 కోట్లు జోడించాల్సి ఉంటుంది. భవిష్యత్తు జనాభాను పరిగణనలోకి తీసుకొని పైపులైన్లు విస్తరించడం, రిజర్వాయర్లు నిర్మించేందుకు ఈ నిధులు ఉపయోగించుకోవాలని ప్రజారోగ్యశాఖ చర్యలు చేపట్టింది. కరీంనగర్‌లోని ఐదు ప్రాంతాల్లో ఫీడర్ పైపులైను 17.7 కిలోమీటర్లు, పంపిణీ పైపులైను 261 కి.మీ, రిజర్వాయర్లు 14, పెద్దపల్లి జిల్లాలో పంపిణీ పైపులైను 73 కి.మీ, జగిత్యాల జిల్లాలో 16.1 కి.మీ, పంపిణీ పైపులైను 106కిమీ, 7 రిజర్వాయర్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడల్లో పంపిణీ లైను 129.11 కిమీ, రిజర్వాయర్లు 5 నిర్మించేందుకు ప్రణాళికలు చేసినట్లు సమాచారం.

# రాయితీ యంత్రం.. అందని వైనం

జగిత్యాల : వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రమవుతుండగా సాగుకు సాయంగా నిలిచే ఆధునిక యంత్రాలను రాయితీపై ఇవ్వకపోవటంతో రైతులకు దన్ను కలగటంలేదు. జూన్ 1 నుంచి వానాకాలం సాగు పనులు చేపట్టనుండటం, 2022–23 ఆర్థిక సంవత్సరానికి యంత్ర లక్ష్మి పథకానికి రూ.1,500 కోట్ల నిధులను కేటాయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనటంతో రాయితీ యంత్రాలపై రైతులు ఆశగా ఉన్నారు.బయట కొనాల్సిందే..

జగిత్యాల జిల్లాలో వానాకాలంలో 4.43 లక్షల ఎకరాల్లో ఆహార, ఉద్యానపంటలు సాగుచేస్తారు. మరో 43 వేల ఎకరాల్లో పండ్లతోటలున్నాయి. ప్రస్తుతం సాగుకు 3,520 ట్రాక్టర్లు, 1,810 రోటోవేటర్లు, 4 ప్యాడీ త్రెషర్స్, 209 హార్వెస్టర్లు, 79 మినీ ట్రాక్టర్లు, 95 పవర్ టిల్లర్లను రైతులు వినియోగిస్తున్నారు. ప్రతి సీజన్‌లోనూ కనీసం 50–100 వరకు ట్రాక్టర్లను రైతులు కొనుగోలు చేస్తారు. గతంలో వీటన్నింటిపై రాయితీ ఉండేది. కాగా యంత్రాలు, పరికరాలు, పనిముట్లు, ట్రాక్టర్ల రాయితీని నిలిపివేయటంతో రైతులే పూర్తిధరకు బయటి మార్కెట్లో కొనాల్సివస్తోంది. దీంతో రైతులపై ఆర్థికభారంతో పాటుగా నాణ్యమైన పరికరాలు, యంత్రాలు లభించటంలేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల మందుల పిచికారీకి డ్రోన్లను వినియోగిస్తున్నారు. హార్వెస్టర్లు, మినీట్రాక్టర్లు, పవర్‌టిల్లర్ల వినియోగం కూడా పెరగగా బోదెలు చేయటం, పసుపు ఉడికించి పాలిషింగ్, పత్తిలో దౌరకొట్టడం, మొక్కజొన్నలను ఒలవటం, ఇతర పంటల నూర్పిడి, మామిడిలో సస్యరక్షణ మందుల పిచికారీ, నేలలను చదును చేయటం, గట్టుచేయటం తదితరాలన్నీ యంత్రాలు, పరికరాల సాయంతోనే చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో యంత్రాలతో పాటు టార్పాలిన్‌షీట్లు, పంపుసెట్లు, పిచికారి యంత్రాలు, సీడ్‌డ్రిల్, నీటిపైపులు, బిందు, తుంపర సేద్య పరికరాలు, పాలీహౌజులు. సోలార్ ఫెన్సింగ్, పత్తితీత యంత్రాలు, మామిడి కాయలను తెంపే పరికరాలు, కొడవళ్లు, గడ్డి కత్తిరించే యంత్రాలు, ఇతరత్రా ఎద్దులతో నడిపే పరికరాల రాయితీని పునరుద్ధరించాలి.తొమ్మిదేళ్లుగా..రెండు సీజన్లలో కలిపి జిల్లాకు కనీసం రూ.75 కోట్ల వరకు నిధులను ఆర్‌కేవీవై, యంత్రలక్ష్మి, ఉద్యానశాఖ పథకాల ద్వారా ఇవ్వాల్సి ఉన్నా తొమ్మిది సీజన్లుగా నిధులను విడుదల చేయటంలేదు. కల్టివేటర్, రోటోవేటర్, ఫ్లవ్‌లతో నేలను దున్నటం, దమ్ముచేయటం, సరుకుల రవాణా తదితరాలకు ట్రాక్టర్‌ల వినియోగం తప్పనిసరిగా మారింది. చాలా గ్రామాల్లో దుక్కిటెడ్ల స్థానంలో ట్రాక్టర్లు చేరాయి.

# గర్భిణులకు రక్షగా.. పోషకాహార కిట్లు

కొత్తగూడెం : కేసీఆర్ న్యూట్రిషియన్ కిట్స్ జిల్లాలో సత్ఫలితాలు సాధిస్తోంది. గర్భిణుల్లో రక్తహీనత సమస్యను అధిగమించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతిష్ఠాత్మకంగా ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది ఏజెన్సీ జిల్లాల్లో పథకానికి రూపకల్పన చేయగా ప్రయోగాత్మకంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అందులో స్థానం దక్కించుకుంది. ఖరీదైన న్యూట్రిషియన్ కిట్ల కారణంగా గర్భిణుల్లో చాలా వరకు రక్తహీనత సమస్యలు మరుగున పడుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలలో రెండు ఏఎన్‌సీ పరీక్షలు చేయించుకున్న తరువాత అందిస్తున్న కిట్లను దుర్వినియోగం చేసుకోకుండా వినియోగించడంపై వైద్యాధికారులు చైతన్య కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కిట్లు పొందడానికి అర్హులైన ప్రతి గర్భిణి వాటిని ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలపై ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు అవగాహన కల్పిస్తున్నారు.

తగ్గుతున్న శాతం

జిల్లాలో రక్తహీనత సమస్యతో బాధపడుతున్న గర్భిణుల శాతం కొంత వరకు తగ్గుముఖం పడుతోంది. కేవలం న్యూట్రిషియన్ కిట్లు పంపిణీ మాత్రమే కాకుండా ఆ సమస్యను అధిగమించడానికి అవసరమైన



ఔషధాలు పంపిణీ చేయడంలో వైద్య, ఆరోగ్య శాఖ జాగ్రత్తలు చేపడుతోంది. గర్భిణుల పోషకాహారాన్ని తీసుకోవడంపై దృష్టిసారిస్తున్నారు. పైగా గర్భిణులకు న్యూట్రిషియన్ కిట్లలో అందుబాటులోకి వస్తున్న ఖరీదైన డైట్‌తో రక్తహీనత సమస్య నెమ్మదిగా అవరోహణమవుతోంది. గర్భిణుల నమోదు ప్రక్రియ ప్రారంభమైన సమయంలో జిల్లా వ్యాప్తంగా ఎనిమియా బాధితుల సంఖ్య 61 శాతం నమోదైంది. ఐదు నెలల తరువాత ఎనిమియా బాధితులు 58 శాతానికి తగ్గింది. మూడు శాతానికి తగ్గుముఖం పట్టడం కొంత వరకు మెరుగైన ఫలితమేనని వైద్యాధికారులు అభిప్రాయపడుతున్నారు. ఎనిమియాను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో చేపడుతున్న కార్యాచరణలో తమవంతు బాధ్యతను నిర్వర్తించడానికి సన్నద్ధంగా ఉన్నామంటూ పేర్కొంటున్నారు. రక్తహీనత సమస్య కారణంగా మాతా, శిశు మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో ఆ సమస్య నుంచి గర్భిణులను తప్పించడంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

# ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ విడుదల

ఖమ్మం : వచ్చే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు ఓటర్ల జాబితా సవరణకు షెడ్యూల్ విడుదల చేసింది. వచ్చే అక్టోబరు 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల వయసు నిండిన వారికి ఓటుహక్కు కల్పించనున్నారు. అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్‌లో నిరంతరం దరఖాస్తు చేసుకునే వీలుంది. ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ ప్రకారం....



ముసాయిదా జాబితా తయారీకి ముందు... మే 25 నుంచి జూన్ 23 వరకు: బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలిస్తారుజూన్ 24 నుంచి జులై 24 వరకు పోలింగ్ కేంద్రాలు, లొకేషన్ మార్పులు, సవరణలు, పోలింగ్ కేంద్రాల పరిధి, హద్దులు ప్రతిపాదనలు, ఖరారు జులై 25 నుంచి 31 వరకు: ముసాయిదా ఓటర్ల జాబితా తయారు

విడుదల తర్వాత.. ఆగస్టు 2వ తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన ఆగస్టు 2 నుంచి 31వ తేదీ వరకు ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులు, సవరణకు దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబరు 22 వరకు: దరఖాస్తుల పరిష్కారం అక్టోబర్ 4: ఫైనల్ ఓటర్ల జాబితా ప్రకటన (ఇదే ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ జాబితాలో పేరు నమోదైన వారు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటారు.) ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులు వివరించారు. ఓటర్ల జాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

# సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

గోదావరిఖని : కార్పొరేషన్ పాలకవర్గం గడువు సమీపిస్తున్న కొద్దీ కార్పొరేటర్లలో ఆందోళన మొదలైంది.. సంబంధిత డివిజన్లలోని సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తున్న నగరపాలక అధికారులు టెండర్లు పూర్తయినా అభివృద్ధి పనులు చేపట్టడంలో జాప్యం చేస్తుండటంతో కార్పొరేటర్లు నిరసనలతో రోడ్డెక్కాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా అందులో అధికార పార్టీ, ఆ పార్టీలో చేరిన కార్పొరేటర్లే 37 మంది. సమస్యల పరిష్కారంపై అన్ని పార్టీల సభ్యుల్లోనూ ఆందోళన ఉండగా అధికార పార్టీ వారే నిరసనలకు దిగుతుండటం గమనార్హం. గతంలో విఠల్‌నగర్‌లోని ఓ రోడ్డు నిర్మాణంలో గుత్తేదారు నిర్లక్ష్యంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆ డివిజన్ కార్పొరేటర్ మేయర్‌తోపాటు తోటి కార్పొరేటర్ల సమక్షంలోనే గుత్తేదారు తీరుపై ఆందోళనకు దిగారు. తమ డివిజన్‌లో అభివృద్ధి పనుల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ కొద్ది నెలల క్రితం 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్ నగరపాలికలోని ఇంజినీరింగు విభాగంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. టెండరు పూర్తయినా డివిజన్‌లోని వివిధ గల్లీల్లో రోడ్ల నిర్మాణం చేపట్టడం లేదంటూ 32వ డివిజన్ కార్పొరేటర్ ఐత శివకుమార్ ఈ నెల 22న నగరపాలక కార్యాలయం ముందు మండుటెండలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు.

# విస్తరిస్తున్న వైరస్



ఖమ్మం : కాలేయ సంబంధిత వ్యాధుల్లో ఒకటైన హెపటైటిస్ బీ, సీ వైరస్ జిల్లాలో వ్యాపిస్తోంది. ఒకరి నుంచి మరొకరికి సోకే ఈ వ్యాధి కాలేయ క్యాన్సర్‌కు దారి తీయడంతో ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉంటుంది. దీన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో 'జాతీయ హెపటైటిస్ నియంత్రణ' కార్యక్రమం అమలు చేస్తోంది. సర్వజన ఆస్పత్రిలో నోడల్ అధికారిగా వైద్యాధికారిని, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్, హెల్త్ కేర్ ప్రొవైడర్‌ను నియమించి చికిత్స అందిస్తోంది. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ రోగులకు అవసరమైన ఔషధాలను ఉచితంగానే పంపిణీ చేస్తోంది. ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ నిపుణులు లేకపోవడంతో రోగులు ఆశించిన స్థాయిలో ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవడం లేదు. ప్రైవేటుకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు.

పరీక్షలే ప్రధానం..శరీర స్రావాల ద్వారా సోకే ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోగ నిరోధక శక్తి తగ్గిన వారిలో ఈ వ్యాధి వేగంగా విస్తరిస్తుంది. వైరస్ విస్తరణ నేపథ్యంలో 3 నుంచి 5 శాతం కేసులు నమోదవుతున్నట్లు ఓ వైద్య నిపుణుడు తెలిపారు. వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు. సర్వజన ఆస్పత్రిలో అన్ని సదుపాయాలు ఉన్నా జిల్లా వాసులు వినియోగించుకోవడం లేదు. వ్యాధి నిర్ధారణ అయిన పలువురికి డయాలసిస్ కేంద్రంలో ప్రత్యేకంగా చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు చేయగా ముగ్గురికి పాజిటివ్‌గా తేలింది.

తస్మాత్ జాగ్రత్త

హెపటైటిస్ వ్యాధి గర్భస్థ దశలో తల్లి నుంచి శిశువుకు సోకే ప్రమాదం ఉంది. గర్భంలో ప్లాసెంటా, కాన్పు తర్వాత తల్లిపాల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతోంది. గర్భిణులు సంబంధిత పరీక్షలు చేయించుకొని నిర్ధారించుకొని చికిత్స తీసుకుంటే పుట్టబోయే బిడ్డ కూడా క్షేమంగా ఉంటుంది. అలసట, బరువు తగ్గడం, జ్వరం, చర్మంపై మచ్చలు, ముదురు రంగు మూత్రం, కడుపునొప్పి, అజీర్తి, ఆకలి మందగించడం, నీరసం వంటి లక్షణాలు ఉన్నట్లైతే హెపటైటిస్ బీ, సీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. కామెర్ల లక్షణాలు కూడా కన్పిస్తాయి. ముందస్తు నివారణ కోసం వైద్యుల సిఫార్సుతో ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ తీసుకోవచ్చు. చిన్నపిల్లలకు సామూహిక వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేస్తారు.ఇటీవల కేసులు పెరుగుతున్నాయి. అసురక్షిత లైంగిక సంపర్కం, సిరంజిలను వాడటం, రక్త మార్పిడి వల్ల వ్యాధి సోకే ప్రమాదం ఉంది. హెపటైటిస్ బీ, సీ ఉన్నట్లు నిర్ధారణ అయితే చికిత్స తీసుకోవాలి. సర్వజన ఆస్పత్రిలో వైద్యం అందుబాటులో ఉంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.డాక్టర్ రాంప్రసాద్, నోడల్ అధికారి

# మట్టి.. కొల్లగొట్టి



కొణిజర్ల : నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం.. జేసీబీ యజమానులు, మట్టి వ్యాపారులకు వరంగా మారింది. సాగర్ ఎడమ కాల్వ పక్కనున్న మట్టి వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కాల్వ తవ్వినపుడు మట్టిని దానిపక్కన పెద్దపెద్ద గుట్టల్లా పోశారు. రూ.కోట్లు విలువ చేసే ఆ మట్టి గుట్టలు ప్రస్తుతం కరిగిపోతుతున్నాయి. ప్రస్తుతం మట్టి, గ్రావెల్‌కు డిమాండ్ ఎక్కువ ఉంది. వేసవిలో పొలాలు చదును చేసుకునేవారు, రియల్ వెంచర్లలో రోడ్లు, ఇతరత్రా చదును చేసే పనులకు మట్టి అధికంగా అవసరం ఉంటుంది. వెంకటాయపాలెం, తనికెళ్ల, రామనర్సయ్యనగర్, విక్రంనగర్, ఉప్పలచెలక, ఏన్కూరు మండలం తిమ్మారావుపేట, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, ఇలా కాల్వ ఉన్న ప్రతి మండలంలో మట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. వారం రోజులుగా విక్రంనగర్, ఉప్పలచెలక దగ్గర ఉన్న గద్దలగూడెం మేజర్ వద్ద జేసీబీలతో మట్టిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అధికారుల నుంచి అనుమతి తీసుకున్నామనే సాకులు చెబుతూ మట్టి దందాను కొనసాగిస్తున్నారు. ట్రాక్టర్ మట్టికి రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. బోడియాతండా, గుబ్బగుర్తి, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు మండలాలకు చెందిన కొందరు వ్యాపారులు ఇదే పనిగా పెట్టుకుని కాల్వ మట్టిని తరలిస్తున్నారు.

నిబంధనలను పక్కనపెట్టి..

మట్టిని వినియోగించుకోవాలంటే జలవనరుల శాఖ అధికారులకు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం మట్టి తరలించడానికి అనుమతి ఇస్తారు. అది కూడా రైతులకు మాత్రమే వీలుంటుంది. ఇక్కడ రైతుల పేరుతో వ్యాపారులు మట్టి దందాను కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు కాలువపై ప్రయాణం చేస్తే ఎంత మట్టి బయటకు తరలిపోయిందో స్పష్టంగా అర్థమవుతుంది. ఈ విషయంపై స్థానిక రైతులు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకునే పరిస్థితి లేదు. మట్టి తరలిస్తున్నారనే సమాచారాన్ని రాత్రిపూట చెబితే ఆ సమయంలో ఎలా వస్తామంటరూ.. పగటి వేళ చెబితే అంతా దూరం ఎలా రావాలంటూ అధికారులు తప్పించుకుంటున్నారనే వాదనలున్నాయి.. విలువైన కాలువ మట్టిని కాపాడుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే 70 శాతం వరకు మట్టిని బయటకు తరలించారు. ఉన్న మట్టిని కాపాడుకోకపోతే మేజర్లు, మైనర్లు, ఇతర కాలువలకు గండ్లు పడినపుడు వాడుకోవడానికి మట్టి దొరకడం కష్టమే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మట్టి వ్యాపారంపై దృష్టి సారిస్తే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుంది.

మా దృష్టికి రాలేదు: అబీద్, ఎన్నెస్పీ, ఏఈ

గద్దలగూడెం మేజర్ వద్ద మట్టి తోలకాలు మా దృష్టికి రాలేదు. సాగర్ ప్రధాన కాలువ పక్కన కాబట్టి మానిటరింగ్ అధికారులు చూస్తారు. మాకు సంబంధం లేదు. వారి దృష్టికి తీసుకువెళ్తాను.

# చేపల వంటకాలు భలే.. భలే!

ఖమ్మం : తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లాలో (జూన్ 6, 7, 8), ఖమ్మం జిల్లాలో (జూన్ 8, 9, 10) చేపల ఆహార దినోత్సవం (ఫిష్ ఫుడ్ ఫెస్టివల్) నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైన స్టాల్స్ ఏర్పాటుకు అధికారులు యత్నిస్తున్నారు. చేపలు, రొయ్యలతో నోరూరించే వంటకాలను అందుబాటులో ఉంచనున్నారు.

శిక్షణ పొందిన సభ్యులతో...

మహిళా మత్స్య సహకార సంఘాలకు చెందిన 27 మందికి గత ఫిబ్రవరిలో ఖమ్మంలోని టీటీడీసీలో 'సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వా కల్చర్- విశాఖపట్నం' ఆధ్వర్యంలో చేపల వంటకాలపై శిక్షణ ఇచ్చారు. తర్ఫీదు పొందిన వారికి రూ.50వేల విలువైన వంటల తయారీ పరికరాలను ఉచితంగా అందించారు. మరో 21 మందికి హైదరాబాద్‌లో చేపల వంటకాలపై ఇటీవల శిక్షణ ఇచ్చారు. తర్ఫీదు పొందిన వారితోనే ఫుడ్ ఫెస్టివల్‌ను అధికారులు నిర్వహిస్తారు. వివిధ రకాల రుచికరమైన వంటకాలను తయారుచేయటం ద్వారా వినియోగదారులను ఆకర్షిస్తారు. మత్స్య సహకార సంఘాల సభ్యులు మొబైల్ ఫిష్ ఔట్‌లెట్ నిర్వహించుకునేందుకు తోడ్పాటునందిస్తారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మత్స్య సహకార సంఘాలు బలోపేతమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

చేపలు మంచి పోషకాహారం. వీటిని ఏరూపంలో తీసుకున్నా ఆరోగ్యానికి మేలు. చాలామందికి చేపల వంటకాలపై అవగాహన లేదు. అందుకే ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. చేపల వినియోగాన్ని పెంచటమే కార్యక్రమం ఉద్దేశం. ఫుడ్ ఫెస్టివల్ విజయవంతానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. పది స్టాళ్లను నెలకొల్పుతున్నాం.

చేపల పచ్చళ్లు కొర్రమీను పచ్చళ్లు ఫిష్ బర్గర్స్ ఫిష్ సమోసా

# పత్తి విత్తనాలపై కంపెనీల పెత్తనం

ఖమ్మం : ఈ సంవత్సరం కంపెనీలు వివిధ రకాల పత్తి విత్తనాల ధరలు పెంచి రైతుల నడ్డి విరుస్తున్నాయి. బీటీ-2 రకం పత్తి విత్తనాల ప్యాకెట్ ధర గతేడాది రూ.810 ఉండగా ఈసంవత్సరం రూ.853గా కంపెనీలు ధర నిర్ణయించాయి. ప్యాకెట్‌కు రూ.43 చొప్పున పెంచాయి. దీనివల్ల విత్తనాల రూపంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులపై సుమారు రూ.4 కోట్లకు పైగా అదనపు భారం పడుతోంది. పెట్టుబడులు పెరిగి..ఇప్పటికే పెట్టుబడులు భారీగా పెరిగి సేద్యం చేయలేని రైతులకు ఇది పిడుగులాంటి వార్తే. కంపెనీల నిర్ణయం రైతులకు నష్టం కలిగిస్తుంది. ఏటా వానాకాలం సీజన్‌లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు 4.80 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తారు. ఉభయ జిల్లాల్లో అత్యధికంగా సాగు చేసే వాణిజ్య పంట ఇదే కావటం విశేషం. ఒకవైపు పత్తికి ఆశించిన స్థాయిలో మద్దతు ధర లభించకపోవటం, సరైన దిగుబడులు రాకపోవటం, ఎగుమతులు లేక ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ట్రాక్టర్లు, డీజిల్, ఎరువులు, కూలీల ధరలు విపరీతంగా పెరిగాయి. తాజాగా పత్తి విత్తనాల ధర పెంచుతూ కంపెనీలు నిర్ణయం తీసుకోవటం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు రైతుల పరిస్థితి తయారైంది.

ధర లేక దిగాలుక్వింటా పత్తికి కనీసం రూ.9వేల పైన ధర పలికితేనే రైతుకు కొంతవరకు గిట్టుబాటు అయ్యే అవకాశముంది.

# మణుగూరుకు కొత్తరూపు

మణుగూరు : మణుగూరు పట్టణం రూపురేఖలు మరోసారి మారనున్నాయి. సింగరేణి బొగ్గు గనులు, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుతో మణుగూరు పారిశ్రామికంగా విరాజిల్లుతుంది. అయితే 2009-15 మధ్యలో ఏర్పాటైన మణుగూరు ఓపెన్ కాస్ట్‌తో పట్టణ ముఖచిత్రం నుంచి గ్రామాలు కనుమరుగయ్యాయి. మళ్లీ ఇప్పుడు బీటీపీఎస్ రైలు మార్గం కోసం పట్టణంలోని 113 ఇళ్లను తొలగించనున్నారు. ఈ నేపథ్యంలో మణుగూరు మళ్లీ కొత్తరూపు సంతరించుకోనుంది. ఇప్పటికే రైలు మార్గం కోసం సేకరించిన ఇళ్లను రెవెన్యూశాఖ నేలమట్టం చేస్తోంది.

ప్రత్యేక ఆకర్షణగా రైలు మార్గం

పట్టణ నడిబొడ్డు నుంచి బీటీపీఎస్ రైలు మార్గం ఏర్పాటు కానుంది. దీంతో ఆ రైలు మార్గం ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. ఓ వైపు నివాసాలు, మరోవైపు రైలు మార్గం నుంచి బొగ్గు రవాణా జరగనుంది. అంతేకాకుండా రైలుమార్గం కోసం ఏర్పాటు చేస్తున్న వంతెనలు సైతం పట్టణ మార్పునకు సంకేతం కానున్నాయి. రాజుపేటకు వెళ్లే రోడ్డులో అండర్ బ్రిడ్జి నిర్మించారు. విద్యుత్తు కార్యాలయం సమీపంలో ప్రధాని రహదారిపై మరో అండర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. చెరువుముందు గ్రామంలో రైలు మార్గం వై జంక్షన్‌ను ఏర్పాటు చేయనున్నారు.

పట్టణ విస్తరణ అనివార్యం



సింగరేణి బొగ్గు గనులు, రైలు మార్గం ఏర్పాటుతో మణుగూరు పట్టణం విస్తీర్ణం తగ్గుతుంది. భవిష్యత్తులో పట్టణ విస్తరణ అనివార్యం కానుంది. పట్టణ జనాభా క్రమేణా పెరుగుతుంది. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ సంస్థ సర్వేలో జనాభా పెరుగుదలలో మణుగూరు తొలి స్థానంలో ఉంది. ఈక్రమంలో జనాభాకు తగిన సౌకర్యాలు, నివాసాలు అవసరం కానున్న నేపథ్యంలో పట్టణానికి ఆనుకొని ఉన్న పంచాయతీల్లోని కొంత భాగాన్ని పురపాలకంలో కలిపితే ఉపయోగకరంగా ఉంటుంది. కొన్నేళ్ల క్రితం సమితిసింగారంలోని కొంత భాగాన్ని పురపాలకంలో కలపాలని అధికారులు సర్వే చేశారు. కానీ కార్యరూపం దాల్చలేదు. ఏదేమైనా రానున్న కాలంలో మణుగూరు పట్టణం విస్తరణ వైపు దిశగా వెళ్లాల్సిన అవసరం ఉంది.

దశల వారీగా కూల్చి వేస్తున్నాం

నాగరాజు, తహసీల్దార్

బీటీపీఎస్ రైలు మార్గం కోసం తీసుకొన్న ఇళ్లను దశల వారీగా కూల్చి వేస్తున్నాం. అర్అండ్ఆర్ ప్యాకేజీ తీసుకొన్న వారు ఇళ్లను ఖాళీ చేయాలని సూచించాం. ఇప్పటి వరకు 15 ఇళ్లు నేలమట్టం అయ్యాయి.

# ఎక్కడి వాళ్లక్కడే!

హనుమకొండ : పారిశుద్ధ్య కార్మికుల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పనిచేసేది ఒక దగ్గర, బయోమెట్రిక్ అటెండెన్సు మరో చోట వేస్తున్నారు. దీనివల్ల సుమారు 250-300 మంది కార్మికులు ఎక్కడ పనిచేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొందరు అటెండెన్సు వేసి ఇంటికెళ్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి పని దొంగలను పట్టేందుకు ప్రజారోగ్య విభాగం దృష్టి సారించింది. వారం రోజుల క్రితం కొత్త కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ఐదారుగురు శానిటేషన్ కార్మికులు ఎక్కడ పనిచేస్తున్నారో చూపించ లేకపోయారు. బయోమెట్రిక్ అటెండెన్సులో విధులకు హాజరైనట్లుగా ఉంది, వాళ్లు ఎక్కడున్నారని కమిషనర్ అడిగితే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు బేలచూపులు చూశారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. ఎక్కడ బయోమెట్రిక్ అటెండెన్సు వేస్తున్నారో అదే డివిజన్‌లో పనిచేసేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. నగరంలోని 66 డివిజన్ల వారీగా పారిశుద్ధ్య కార్మికుల జాబితా సిద్ధమైంది. ఎక్కడి వాళ్లక్కడే పనిచేసేలా కొత్త పద్ధతి అమల్లోకి రానుంది.

10వేల జనాభాకు 28 మంది కార్మికులు : రాష్ట్ర పురపాలక శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నగరంలోని 66 డివిజన్ల వారీగా పారిశుద్ధ్య కార్మికుల కేటాయింపుపై గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగం దృష్టి సారించింది. 10 వేల జనాభా కలిగిన డివిజన్‌కు 28 మంది కార్మికులు పనిచేయాలి. ఇదే పద్ధతిన డివిజన్ల వారీగా జనాభాను



పరిగణలోకి తీసుకొని శానిటేషన్ కార్మికులను కేటాయిస్తారు. ఒక్కో డివిజన్‌కు 35-40 మందిని కేటాయించే అవకాశాలున్నాయి. ఎక్కడి వాళ్లక్కడే పని చేసేలా జాబితా సిద్ధం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. జూన్ మొదటి వారం నుంచి కొత్త విధానం అమల్లోకి రానుంది.

కార్మికుడి నిరసన: హనుమకొండ ప్రాంతంలో పనిచేస్తున్న కె.చిన్నబాబు అనే శానిటేషన్ కార్మికుడు సోమవారం మధ్యాహ్నం బల్దియా ప్రధాన కార్యాలయంలోని ముఖ్య ఆరోగ్యాధికారి ఛాంబర్ ముందు హల్‌చల్ చేశారు. ఒక డివిజన్ నుంచి మరొక డివిజన్‌కు వెళ్లాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒత్తిడి చేస్తున్నారంటూ కాలం చెల్లిన సిరప్(మందు) తాగారు. వెంటనే అక్కడున్న వారు వారించి ఆసుపత్రికి తరలించారు. ఆరో డివిజన్‌లో పనిచేస్తున్నానని, 51 డివిజన్‌కు వెళ్లాలని ఇన్‌స్పెక్టర్ ఒత్తిడి చేశారని ఆరోపించారు.

పారదర్శకం చేస్తాం

- డాక్టర్ రాజేష్, ముఖ్యఆరోగ్యాధికారి

పారిశుద్ధ్య కార్మికుల పనితీరు పారదర్శకం చేస్తాం. కార్మికులు ఎక్కడైతే బయోమెట్రిక్ అటెండెన్సు వేస్తారో అక్కడే పనిచేయాలి. 66 డివిజన్ల వారీగా జాబితా సిద్ధమైంది. హనుమకొండకు చెందిన కార్మికుడి ఘటనపై విచారణ చేపడతాం.

# కొత్త వాహనాలు.. 'చెత్త' పాలు

నిర్మల్ : ప్రభుత్వం పురపాలకల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక గ్రాంట్లను మంజూరు చేస్తోంది. ఆ నిధులను ప్రణాళికబద్ధంగా వినియోగించాల్సిన అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కాగజ్‌నగర్ పురపాలికలో రూ.లక్షల వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలు, సామగ్రిని వినియోగించకుండానే మూలన పడేస్తున్నారు. వాటి విలువైన పరికరాలు అపహరణకు గురవుతున్నాయి. అయినప్పటికీ అధికారులు, పాలకవర్గం సభ్యులు పట్టించుకోవడం లేదు. దీంతో పారిశుద్ధ్యం నిధులు 'చెత్త' పాలవుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధుల కింద 2018-19 సంవత్సరంలో అప్పటి కాగజ్‌నగర్ పురపాలక అధికారులు రూ.20 లక్షల వ్యయంతో 7 ఎలక్ట్రికల్ ఆటో ట్రాలీలు(టెండర్లు పిలవకుండానే) ఓ కంపెనీ నుంచి కొనుగోలు చేశారు. ఈక్రమంలో ఆటో ట్రాలీలు నాసిరకంగా ఉన్నాయని, బ్యాటరీల్లో లోపాలున్నాయని అప్పటి పాలకవర్గం సభ్యులు ఆరోపించారు. వాటిని వెనక్కి పంపించాలంటూ డిమాండ్ చేశారు. కానీ ముందస్తు ఒప్పందం కుదుర్చుకోవడంతో అధికారులు తిరిగి పంపించలేకపోయారు. నెలరోజులకే మూలకు..ఆటో ట్రాలీలను వాడటం ప్రారంభించిన నెలరోజులకే పరికరాలు ఊడిపోవడం.. బ్యాటరీలు పని చేయకపోవడంతో వాటిన్నంటిని స్థానిక ఎల్లాగౌడ్‌తోటలోని మంచినీటి రిజర్వాయర్ ఏరియాలో మూలనపడేశారు. ఆటో ట్రాలీలకు చెందిన



బ్యాటరీలు మాయమయ్యాయి. ఒక్కో బ్యాటరీ విలువ రూ.10 వేలు ఉంటుంది. వాటితో పాటు విలువైన పరికరాలు కూడా అపహరణకు గురయ్యాయి. ప్రస్తుతం ఆ ట్రాలీలు తుక్కులో విక్రయించాల్సిందే.

కొనుగోలు సరే.. వినియోగం ఏదీ?

పురపాలక పరిధిలోని 30 వార్డులున్నాయి. ప్రతి వార్డులో గతంలో ఏర్పాటు చేసిన ఇనుప చెత్తకుండీలన్నీ ప్రస్తుతం శిథిలమయ్యాయి. ఆ స్థానంలో రూ.1.30 లక్షల వ్యయంతో 60 ప్లాస్టిక్ చెత్తకుండీలను గతేడాది కొనుగోలు చేశారు. ఆ చెత్తకుండీలు పలు చౌరస్తాల్లో ఏర్పాటు చేయగా, వినియోగానికి అనుకూలంగా లేకపోవడంతో ప్రజలు వాటి పక్కనే చెత్త వేస్తున్నారు. దాదాపు మరో 40 చెత్త ప్లాస్టిక్ డబ్బాలు కార్యాలయంలోని పైఅంతస్థులో నిరుపయోగంగా పడవేశారు. అందులోనూ పలు డబ్బాలు నాసిరకంగా ఉండటంతో వాడకముందే మూతలు ఊడి, స్టాండ్‌లు విరిగి పోయాయి.

గతంలో కొనుగోలు చేశారు – రాజు, పురపాలక కమిషనర్

ఎలక్ట్రికల్ వాహనాలు, ఇతర సామగ్రిని గతంలో అధికారులు కొనుగోలు చేశారు. మాకు ఎలాంటి సంబంధం లేదు. ప్రస్తుతం పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

# కొత్త రైతులకు బీమా... ధీమా

మంచిర్యాల : కష్టాన్నే నమ్ముకొని పనిచేస్తున్న రైతన్నకు అనుకోని నష్టం వస్తే అతడి మరణానంతరం కుటుంబానికి ఆర్థిక భరోసానిచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని తెచ్చింది. 2018లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ప్రభుత్వమే రైతు పేరిట ఏడాది కాలానికి బీమా చేయిస్తుంది. సదరు పట్టాదారుడు ఏ కారణం చేత మరణించినా వారి కుటుంబానికి భారతీయ బీమా సంస్థ(ఎల్ఐసీ) రూ.5లక్షల పరిహారాన్ని పక్షం రోజుల్లో అందజేస్తుంది. గతేడాది ఈ పథకంద్వారా బీమా తీసుకున్న రైతులకు ఈ నెలతో కాలపరిమితి ముగుస్తుంది. దీంతో అప్పటి వరకు ఉన్నవారికి రెన్యూవల్ చేస్తుండగా నూతనంగా పట్టాపాస్ పుస్తకం కలిగి ఉన్న వారి నుంచి నూతన దరఖాస్తులను వ్యవసాయశాఖ స్వీకరిస్తుంది.

పాస్‌పుస్తకం ఉండాలి..ఒక గుంట భూమి ఉండి పట్టాపాస్ పుస్తకం ఉన్న వారికి బీమా వర్తిస్తుంది. గతేడాది రూ.3,487ల ప్రీమియంను ప్రభుత్వం ఒక్కో రైతు పేరిట చెల్లిస్తుంది. నూతనంగా పథకంలో చేరే రైతులు మాత్రం ఈ ఏడాది జూన్ 22 వరకే కొత్త పాస్‌పుస్తకం కలిగి ఉండాలి. లేని పక్షంలో ప్రవేశం ఉండదు. అర్హులైన రైతులు ఆగస్టు 1 లోగా స్థానిక మండల వ్యవసాయ అధికారులకు దరఖాస్తులు



అందజేయాల్సి ఉంటుంది.

ఇవీ అర్హతలు: రైతుకు చెందిన పొలానికి సంబంధించిన పట్టాపాసు పుస్తకం కలిగి ఉండాలి. పుస్తకం రాకున్నా ఆన్‌లైన్‌లో డిజిటల్ సైన్‌తో 22.06.2022 లోపు నమోదై ఉండాలి.

ఆధార్ కార్డులో వయస్సు 18 నుంచి 59 సంవత్సరాలు ఉండాలి. అంటే 14.08.1963 నుంచి 14.08.2004 లోపు జన్మించినవారు అర్హులు.

ఎన్ని చోట్ల భూమి ఉన్నా బీమాకు మాత్రం ఒకచోటనే అర్హులు. సంబంధిత రైతులు వారే స్వయంగా కార్యాలయానికి వెళ్లి అధికారి సమక్షంలో దరఖాస్తు అందజేయాలి. పట్టాపాసు పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు ప్రతులను అందజేయాలి.

సవరణలకూ అవకాశం..నామిని పేరు, రైతుల వివరాల్లో మార్పులు, చిరునామా, ఆధార్‌కార్డు, ఫోన్‌నెంబరు, బ్యాంకు ఖాతా తదితర వివరాల్లో మార్పులు చేసుకోవాలనుకున్నవారు కూడా స్థానిక వ్యవసాయ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. అన్ని ధ్రువీకరణ పత్రాల నకలు కాపీలను దరఖాస్తు ఫారానికి జతచేసి అందజేయాలి. గడువులోగా దరఖాస్తు చేసుకోవాలిజి.కల్పన, జిల్లా వ్యవసాయ అధికారి, మంచిర్యాల

రైతు బీమా పథకం ఈ ఏడాదికి గడువు పొడిగించడంతో అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. సవరణలు ఉన్నవారు కూడా స్థానిక వ్యవసాయ కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలి. అర్హులైన వారు కూడా కొందరు దరఖాస్తు చేసుకోవడం లేదు. రైతులందరు సద్వినియోగం చేసుకోవాలి.

# అవసరమే.. కానీ అతి వద్దు!



నిర్మల్ : 'బాసర ఆర్జీయూకేటీలో ఇటీవల నిర్వహించిన వైద్యశిబిరాల్లో 4,876 మంది విద్యార్థులను పరీక్షించారు. వీరిలో 1,078 మంది దృష్టి లోపంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అంటే 22 శాతం మంది కంటి సమస్యలతో బాధపడుతున్నారు. కంప్యూటర్లు, ఫోన్లు ఎక్కువగా వాడుతుండటంతోనే ఈ సమస్య తలెత్తుతోంది.' – వర్సిటీ ఆసుపత్రి వైద్యులు.

ఈ ఒక్క సంఘటన చాలు.. ప్రస్తుతం సమాజంలో నెలకొన్న పరిస్థితిని చాటిచెప్పేందుకు. మారుతున్న కాలానికనుగుణంగా స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరిగింది. దీనికితోడు కంప్యూటర్, ల్యాప్‌టాప్ల ఉపయోగం ఎక్కువ కావడంతో చాలామంది తమకు తెలియకుండానే నేత్ర సంబంధిత అనారోగ్య ఇక్కట్లను కొనితెచ్చుకుంటున్నారు. విద్యార్థి దశ నుంచే ఇది మొదలవుతుండటంతో రోజులు గడిచినా కొద్దీ సమస్య జటిలంగా మారుతోంది.

ఎల్ఈడీ తెరలతోనే...ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అందరికీ స్మార్ట్‌ఫోన్ వినియోగం తప్పనిసరైంది. కరోనా పరిస్థితులతో వర్క్ ఫ్రం హోం, డిజిటల్ తరగతులకు ప్రాధాన్యం ఏర్పడింది. ఫలితంగా విద్యార్థులు, యువత, ఉద్యోగులంతా ఫోన్, ల్యాప్‌టాప్, కంప్యూటర్, టీవీలకు మరింత దగ్గరయ్యారు. అవసరంగా ఉన్న ఈ ఉపకరణాల వినియోగం ఇప్పుడు దాదాపు అందరికీ ఓ అలవాటుగా మారిపోయింది. చరవాణిని వీడి ఉండలేని పరిస్థితి నెలకొంది. సినిమాలు చూడాలన్నా, పాటలు వినాలన్నా, ఆన్‌లైన్ షాపింగ్, డిజిటల్ చెల్లింపులు, ఉద్యోగ బాధ్యతల నిర్వహణ, విద్యార్థులు తరగతులు వినడం, సందేహాలు నివృత్తి చేసుకోవడం, ఆటలాడటం.. ఇలా ఒకటేమిటి అనేక రకాల పనులను కూర్చున్న చోట నుంచే ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లను ఉపయోగించి పూర్తిచేస్తున్నారు. మొదట్లో సరదాగా, ఆనందంగా ఉన్నా.. క్రమేపీ ఈ అలవాటు పలు అనారోగ్య సమస్యలకు కారణభూతంగా మారుతోంది.

దుష్పరిణామాలుంటాయి..– డా.కవిత, వ్యక్తిత్వ వికాస నిపుణురాలు, మంచిర్యాల

తదేకంగా సెల్‌ఫోన్, టీవీలు, కంప్యూటర్ తెరలు చూడటం వల్ల కళ్లు అలిసిపోయి తడారిపోతాయి. బ్లూలైట్ కాంతి కారణంగా ఫలితంగా పొడిబారుతాయి. దీనివల్ల కనురెప్పల వాపు, కళ్లలో దురద, మంట, నొప్పి లాంటి ప్రాథమిక లక్షణాలు కనిపిస్తాయి. దీన్ని వైద్యపరిభాషలో కంప్యూటర్ వీనస్ సిండ్రోమ్ లేక డిజిటల్ కంటి ఒత్తిడిగా పేర్కొంటారు. ఆదిలోనే గుర్తించి జాగ్రత్తపడితే కంటి ఆరోగ్యం కాపాడుకోవచ్చు. లేకపోతే హ్రస్వదృష్టి (మయోపియా) వంటి దృష్టిలోపానికి గురయ్యే అవకాశం ఉంటుంది. రానురానూ జ్ఞాపకశక్తి తగ్గిపోవడంతో పాటు ఆలోచించే శక్తిని కోల్పోతాం. మన అవసరాల్లో అత్యవసరమనుకున్న వాటిని నిర్ధరణ చేసుకొని రోజులో రెండు గంటల్లోపు మాత్రమే ఈ పరికరాలను ఉపయోగించడం అన్నివిధాలా శ్రేయస్కరం.

ప్రత్యక్ష బోధనకే ప్రాధాన్యమివ్వాలి– రమాదేవి, ఉపాధ్యాయురాలు, గుండంపెల్లి

అవసరాల మేరకు డిజిటల్ విధానాన్ని వినియోగించుకోవాలి. కానీ అదే అంతిమ పరిష్కారం కాకూడదు. వీలైనంత వరకు విద్యార్థులకు ప్రత్యక్ష బోధన జరిగేలా చూడాలి. దీనివల్ల విద్యార్థులు సులువుగా నేర్చుకోగల్గుతారు. ప్రయోగాలు, క్షేత్రస్థాయి సందర్శనలతో సందేహాలను నివృత్తి చేసుకోగల్గుతారు. జ్ఞానం ఇనుమడిస్తుంది. ఇతర విద్యార్థులతో కలిసిమెలిసి ఉండటం వల్ల భావ వ్యక్తీకరణ మెరుగవుతుంది. పోటీ ప్రపంచంలో ఎలా రాణించాలో, సమస్యలను ఎలా ఎదుర్కొనాలో అర్థం చేసుకోగల్గుతారు. ఎప్పుడూ ఫోన్, కంప్యూటర్ అంటూ ఒంటరిగా ఉండేవారిలో ఆత్మన్యూనతకు లోనయ్యే అవకాశాలుంటాయి. పైపెచ్చు భవిష్యత్తులో అనారోగ్య సమస్యలకు కారణమవుతాయి.

20:20:20 ఫార్ములాను పాటించాలి– ఉప్పు కృష్ణంరాజు, కంటి వైద్యుడు, నిర్మల్

పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతిఒక్కరూ ధారాళమైన వెలుతురు, గాలి ఉన్న ప్రదేశంలో స్మార్ట్‌ఫోన్‌ను మధ్యస్థ ప్రకాశవంతమైన స్థితిలో ఉంచి వినియోగించాలి. 20:20:20 ఫార్ములాను అమలుచేయడం మంచిది. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువులపై 20 సెకన్ల పాటు దృష్టి మరల్చి చూడాలి. దీంతో కంటి కండరాలకు ఉపశమనం కలుగుతుంది. నిమిషానికి కనీసం పదిసార్లైనా కనురెప్పలార్పడం అలవాటు చేసుకోవాలి. దీంతో కళ్లు పొడిబారకుండా ఉంటాయి. విటమిన్ 'ఏ' సంబంధిత క్యారెట్లు, బొప్పాయి పండు, ఆకుకూరలు, ఉడకబెట్టిన గుడ్లు, చేపలు ఆహారంలో ఉండాలి. తప్పనిసరిగా స్మార్ట్‌ఫోన్ వినియోగించాల్సి వస్తే యాంటీ గ్లేర్ కళ్లద్దాలు, కళ్లలో నీటిశాతం తగ్గిపోకుండా లూబ్రికేటింగ్ కంటి చుక్కల మందులు వాడాలి.

# అధికారులకు మినహాయింపు.. కార్మికులకు వాయింపు





మంచిర్యాల : పెర్క్విసైట్(జీతం లేకుండా ఉచితం)పై విధించే పన్ను నుంచి మినహాయింపు సింగరేణిలో అధికారులకు అమలు చేస్తుండగా కార్మికులపై మాత్రం వివక్ష చూపిస్తున్నారు. దీంతో తాము పొందని వేతనంలో నుంచి పెద్ద మొత్తం పన్ను చెల్లించాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. ఏళ్లు గడుస్తున్నా పన్ను మినహాయింపుపై కార్మికులను విస్మరిస్తున్నారు.

క్వార్టర్లు అంతంతే..సింగరేణిలో పనిచేస్తున్న ఒక సీనియర్ ఏ గ్రేడ్ ఉద్యోగి మూల వేతనం రూ.90 వేలు, వార్షిక ఆదాయం 18,96,489.. దీనిపై పెర్క్విసైట్ (జీతం లేకుండా ఉచితం) కింద రూ.1,76,847.. దీనిపై 30 శాతం పన్ను కింద రూ.53,054 చెల్లించారు. ఇలా చెల్లించిన సొమ్ము కేవలం ఆ ఉద్యోగి సంస్థ కేటాయించిన క్వార్టర్‌లో నివాసం ఉంటున్నందుకు మాత్రమే. ఈ లెక్క ప్రకారం ఉద్యోగి నెలవారీ వేతనంలో రూ.14,737 కనిపించని అదనం చేరుతోంది. ఇదే సొమ్ముతో బయట రెండు, మూడు పడక గదుల ఇళ్లను అద్దెకు తీసుకుని దర్జాగా జీవించవచ్చు. సీ టైపు క్వార్టర్లను మినహాయిస్తే సంస్థ కేటాయించిన క్వార్టర్లు మాత్రం 400 నుంచి 450 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒకే ఒక్క పడక గదితో ఉంటాయి. సంస్థ ఆధ్వర్యంలో కొన్ని పాత కాలం క్వార్టర్లు ఆర్‌సీసీ రేకులతో నిర్మించారు. ఇక షిర్కే, నాగార్జున కంపెనీలు నిర్మించిన రెండంతస్తుల క్వార్టర్లు మరీ ఇరుకుగా ఉంటాయి. వీటి విస్తీర్ణం దాదాపు 400 చదరపు అడుగుల్లోపే ఉంటుంది.ఆదాయ ప్రయోజనం పొందకున్నా..ఉదాహరణకు 20 శాతం పరిధిలో పన్ను చెల్లించాల్సిన ఉద్యోగులు కేవలం ఒకే పడకగది ఉన్న ఈ క్వార్టర్లు పొందినందుకు అదనపు ఆదాయం చూపడం వల్ల 30 శాతం పరిధిలోకి వెళ్లడంతో అదనంగా దాదాపు రూ.లక్ష పన్ను రూపంలో చెల్లించాల్సి వస్తోంది. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం సంస్థలు, పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగుల నివాసం కోసం ఫర్నిచర్‌లేని క్వార్టర్ కేటాయిస్తే వారికి చెల్లించే మొత్తం వేతనంలో 7.5 శాతం ఆదాయం కింద చూపించి పన్ను లెక్కించాల్సి ఉంటుంది. భూగర్భ గనుల్లో పనిచేసే ఉద్యోగులు రూ.40 వేల మూల వేతనం దాటితే, తాము పొందని వేతనంలో నుంచి పెద్ద మొత్తం పన్ను చెల్లించాల్సి వస్తోంది. దీనివల్ల రూ.తొమ్మిది లక్షల పైచిలుకు వార్షికాదాయం పొందేవారు పెర్క్విసైట్స్ మూలంగా తాము తీసుకునే జీతంలో ఎలాంటి ఆదాయ ప్రయోజనం పొందకున్నా.. రూ.పది లక్షలకుపైగా ఆదాయం పొందుతున్నట్లు పరిగణనలోకి తీసుకోవడంతో వీరు 30 శాతం పన్ను స్లాబు పరిధిలోకి వస్తున్నారు. ఇలా తక్కువ ఆదాయం పొందేవారు సైతం వారి పన్ను స్లాబు ఆధారంగా క్వార్టర్ తీసుకున్నందుకు అదనపు ఆదాయం కింద పన్ను పోటు భరించక తప్పడం లేదు. క్వార్టర్‌తోపాటు సంస్థ ఇచ్చే విద్యుత్తు, మంచినీటి బిల్లులు పన్ను పరిధిలోకి వస్తాయి.

కోల్ ఇండియాలో 2011 నుంచే అమలు..

కోల్ ఇండియాలో అధికారులకు ఇదే తరహా పెర్క్విసైట్ పన్నును తిరిగి చెల్లిస్తున్నారు. కోల్ ఇండియాలో 2018 నుంచి అమలు చేస్తుండగా, సింగరేణిలో వెంటనే అమలు ఉత్తర్వులు జారీ చేశారు. కోల్ ఇండియాలో పనిచేస్తున్న ఎన్‌సీడబ్ల్యూఏ పరిధిలోని ఉద్యోగులకు 2011 నుంచి పెర్క్విసైట్‌పై విధించే పన్ను నుంచి మినహాయింపు లభిస్తోంది. 2010-11 ఆర్థిక సంవత్సరం నుంచి కోల్ ఇండియా యాజమాన్యం అక్కడి కార్మికులు చెల్లించే పన్ను స్లాబుల ఆధారంగా అప్ కీప్ అలవెన్సు పేరిట తిరిగి చెల్లిస్తోంది. ఇక్కడ మాత్రం కార్మిక సంఘాలు ఎన్నికల సందర్భంలో ఆదాయపు పన్ను మినహాయించాలని డిమాండ్ చేయడం.. పార్లమెంటులో చర్చిస్తామని.. బొగ్గుగనుల ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలను కలిసి పోరాటం చేస్తామని నేతలు హామీలు ఇవ్వడం.. ఆ తర్వాత మర్చిపోవడం జరుగుతోంది.

# వర్షాలతో ర.భ.శాఖకు రూ. 7.25 కోట్లు నష్టం

ఖమ్మం : ఇటీవల జిల్లాలో కురిసిన అధిక వర్షాలకు వాగులు, వంకలు పొంగి వరదలు రావటంతో పలు శాఖలకు ఆస్థి నష్టం జరిగింది. ప్రధానంగా రహదారులు భవనాల శాఖకు రూ.7.25 కోట్లు నష్టం కలిగినట్లు ప్రభుత్వానికి నివేదిక పంపారు. జిల్లాలో 11 కల్వర్టులు దెబ్బతిన్నాయని, 29 ప్రదేశాల్లో రోడ్లు గండ్లు పడి కోతకు గురవటంతో నష్టం ఏర్పడింది. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు సంబంధించి ఒక కల్వర్టు దెబ్బతినగా రూ.10 లక్షలు ఆస్తి నష్టం కలిగింది. విద్యుత్తు శాఖకు చెందిన 40 స్తంభాలు పడిపోగా రూ.5 లక్షలు, నీటిపారుదల శాఖకు చెందిన రెండు చెరువులకు గండ్లు పడటంతో తాత్కాలిక మరమ్మతులకు రూ.9.90 లక్షలు కావాలని నివేదిక ఇచ్చారు.28 నివాసాలకు నష్టం.. జిల్లాలోని 21 మండలాల్లో అధిక వర్షాలకు 28 నివాసపు ఇళ్లు దెబ్బతినగా 5 పూర్తిగా కూలిపోయాయని, మిగతా వాటికి పాక్షికంగా నష్టం జరిగిందని రెవెన్యూ అధికారులు



నివేదిక అందించారు. వేర్వేరు మండలాల్లో రెండు మేకలు, 8 గేదెలు మృత్యువాత పడ్డాయి. ఆయా శాఖల నుంచి అందిన నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపినట్లు అదనపు కలెక్టర్ మధుసూదన్ తెలిపారు.

# ఖాళీస్థలమే భవనం.. మాయ చేస్తున్న భువన్

మంచిర్యాల :ఈ ఖాళీ స్థలం జీఎస్ ఎస్టేట్ కాలనీ పరిధిలోకి వస్తుంది. ఇప్పటిదాకా ఇక్కడ ఇల్లే నిర్మించలేదు. కానీ ఇల్లున్నట్లుగా అది కూలినట్లుగా భువన్ సర్వేలో నమోదు చేశారు. ఖాళీ స్థలానికి ఏడాదికి రూ.12,00 ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. అదే వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ విధిస్తే మార్కెట్ వాల్యూ ప్రకారం దాదాపు రూ.20 వేలకు పైగానే బల్దియాకు పన్ను కట్టాల్సి ఉంటుంది. కాలనీలో ఇలాంటివి పదుల సంఖ్యలో నమోదై ఉన్నాయి.

బల్దియాలో నిర్మించి ఉన్న ఇళ్లకే కొందరు ఆస్తి పన్నులు చెల్లించకుండా బకాయిలు పడుతున్నారు. కొందరు అక్రమార్కులు మాత్రం లేని ఇళ్లకు ఇంటి నెంబర్లు తీసుకుని ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. ఇల్లు లేకపోతేనేం.. పన్ను చెల్లిస్తున్నారు కదా బల్దియాకు ఆదాయం కూడా వస్తుంది మంచిదేగా అనుకుంటే పొరపాటు. ఆస్తి పన్ను ఇంటి నిర్మాణాన్ని బట్టి నామమాత్రంగా ఉంటుంది. ఏడాదికోసారి చెల్లిస్తే సరిపోతుంది. అదే వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (ఖాళీస్థలం పన్ను)కట్టాలంటే పదింతలవుతుంది. మార్కెట్ విలువలో ఒకశాతం డబ్బులను ఒకేసారి చెల్లించాలి. అంటే ఒక ప్లాటు ధర రూ.20 లక్షలుంటే అందులో రూ.20 వేలు కట్టాలి. వాస్తవానికి ఇల్లు లేని అసెస్‌మెంట్లను, ఇంటి నెంబర్లను ఆస్తుల జాబితా నుంచి తొలగించాలి. ఖాళీ స్థలాలకు వీఎల్‌టీ విధించాలి. సిబ్బంది నిర్లక్ష్యంతో పట్టణంలో ఖాళీ స్థలాల్లో ఇంకా ఇళ్లు ఉన్నట్లుగానే చెలామణి అవుతున్నాయి.

సర్వేలో తప్పులు

రాష్ట్ర ప్రభుత్వం పురపాలకాల్లో ఆస్తుల లెక్కను తేల్చేందుకు 2017లో తొలివిడత భువన్ సర్వే నిర్వహించింది. నివాస, వ్యాపార, వాణిజ్య భవన సముదాయాల కొలతలు తీసుకుని, ట్యాబ్‌లో చిత్రాలను తీసి జియోట్యాగింగ్ చేశారు. మొదటి విడతలో అనేక అక్రమాలు జరిగాయి. ఇల్లు, ఇంటి నెంబర్లు లేకున్నా ఉన్నట్లుగా వివరాలను నమోదు చేశారు. 2020లో మళ్లీ రెండో విడత భువన్ సర్వే ప్రారంభమైంది. కరోనా వ్యాప్తి, లాక్‌డౌన్ కారణంగా నత్తనడకన సాగింది. రెండో విడతలో కొంతమంది ప్రైవేటు సిబ్బందికి ట్యాబ్‌లు ఇచ్చి భువన్ సర్వే చేయించారు. దీంతో కొన్నిచోట్ల లేని ఇళ్లను ఉన్నట్లుగా చూపారు. ఇప్పటిదాకా ఇల్లే కట్టని ప్రాంతాల్లో ఇల్లు నిర్మించినట్లుగా అది కూలిపోయిందన్నట్లుగా వివరాలను పొందుపరిచారు. ఇపుడు అవన్నీ అసెస్‌మెంట్, ఇంటి నెంబర్లతో ఆస్తుల జాబితాలోనే కొనసాగుతున్నాయి.

ఇక్కడ కనిపిస్తున్న ఇల్లు వాస్తవానికి బల్దియా పరిధిలోనిదే కాదు. పట్టణానికి సమీపంలో ఉన్న కచ్‌కంటి గ్రామ పంచాయతీలోకి వస్తుంది. కానీ కేఆర్కే కాలనీలో ఉన్నట్లుగా భువన్ సర్వేలో వివరాలను నమోదు చేశారు. ఇలా ఎనిమిది ఇళ్లను అక్కడి నుంచే జియోట్యాగింగ్ చేశారు. భువన్ సర్వేలో తప్పిదాలు చోటు చేసుకున్నాయనేందుకు ఈ చిత్రమే నిదర్శనం.

అక్రమ రిజిస్ట్రేషన్లకు అవకాశం

బల్దియా నుంచి అసెస్‌మెంట్, ఇంటి నెంబరు ఉన్నట్లు, ఆస్తి పన్ను చెల్లిస్తున్నట్లు రసీదులుండటంతో అక్రమ రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమమవుతోంది. ఇటీవల రిమ్స్ వెనుకాల, కొత్త హౌజింగ్‌బోర్డు కాలనీలో ఇలాంటివి బయటపడ్డాయి. ఖాళీ స్థలాలకు లింకు డాక్యుమెంట్లను పొంది దర్జాగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న విషయం వెలుగుచూసింది. ఇందుకు బల్దియా అధికారులు సహకరించారనే ఆరోపణలు వచ్చాయి. ఆస్తి పన్ను జాబితా నుంచి లేని ఇంటి నెంబర్లను, అసెస్‌మెంట్లను తొలగిస్తే అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట పడుతుందనే భావన వ్యక్తమవుతోంది. అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి ఖాళీ స్థలాల యజమానులకు ఆస్తి పన్ను కాకుండా ఖాళీస్థలాలపన్ను విధించేలా చర్యలు తీసుకుంటే బల్దియాకు భారీగా ఆదాయం సమకూరే అవకాశముంది.

విచారణ చేస్తాం: ఎ.శైలజ, కమిషనర్, బల్దియా

పట్టణంలో గతంలో లేని ఇళ్లు ఉన్నట్లుగా అసెస్‌మెంట్లు చేయడంతో అనేక ఇబ్బందులు వచ్చాయి. రెండో విడత భువన్ సర్వేలో అలాంటి తప్పిదాలు జరిగితే వెంటనే విచారణ జరుపుతాం. ఖాళీ స్థలాలకు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ విధించేలా చర్యలు తీసుకుంటాం.

# కోతుల బెడద.. కుక్కల స్వైరవిహారం

మంచిర్యాల : వానరాలు, శునకాల బెడదతో జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ పురపాలికలతో పాటు గ్రామాల్లోనూ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక్క నిర్మల్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలోనే కుక్కల దాడిలో 1,095 మంది, కోతుల బారినపడ్డ వారు 596 ఉండగా, పీహెచ్‌సీలలో ఈ రెండింటి వల్ల 870 మంది చికిత్సలు చేయించుకున్నారు. ఏరియా ఆసుపత్రిలో వారం రోజుల వ్యవధిలో ముగ్గురు కోతులు, అయిదుగురు కుక్కల గాటుకు గురయ్యారంటే వాటి తీవ్రత ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కరవైన పట్టింపు..స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పురపాలికల్లో గతంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారిని రప్పించి వీటిని పట్టించేందుకు చర్యలు తీసుకున్నారు. నిర్మల్‌లో వానరాల ఇబ్బందులు తీర్చేందుకు కొండ%ళి%ముచ్చులను సైతం తెప్పించారు. అయినప్పటికీ వాటి తీవ్రత తగ్గలేదు. రెండేళ్ల క్రితం జిల్లా కేంద్రం శివారులో కోతుల పునరావాస, సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. వాటి సంతతిని అరికట్టేందుకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి, వాటిని సంరక్షించి అటవీ ప్రాంతాల్లో వదిలిపెట్టేందుకు దీనిని అందుబాటులోకి తెచ్చారు. అయితే పట్టణాలు, గ్రామాల నుంచి వానరాలను పట్టి తీసుకొచ్చే వారు లేక సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది. శునకాల తీవ్రత అదే స్థాయిలో ఉంది. పెద్ద ఎత్తున సంచరిస్తూ.. ప్రజలపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. దీంతో తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక జనం తీవ్ర వేదనకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు వీటి విషయంలో దృష్టి సారించి ఇబ్బందులు దూరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మల్ పట్టణానికి చెందిన ఓ మహిళ ఉతికిన దుస్తులు ఆరేసేందుకు డాబా పైకి వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో ఒకేసారి కోతుల గుంపు రావడంతో భయాందోళనకు గురయ్యారు. ఎక్కడ తనపై దాడి చేస్తాయోనన్న ఆందోళన చెంది కిందికి వచ్చే క్రమంలో కాలు జారి మెట్ల పై నుంచి పడ్డారు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యారు. జిల్లా కేంద్రంలో ఇలాంటి సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి.

సంచరిస్తున్న కుక్కలుసారంగాపూర్ మండలం జౌళి గ్రామానికి చెందిన రెండేళ్ల బాలుడిపై ఇటీవల పిచ్చికుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో బాలుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇలాంటి ఘటనలు ఏదో ఒక చోట నిత్యం చోటు చేసుకుంటున్నాయి.తగిన చర్యలు తీసుకుంటాం– సంపత్‌కుమార్, పురపాలిక కమిషనర్, నిర్మల్‌వానరాలు, శునకాలు పట్టే వారిని రప్పిస్తాం. కోతులను పట్టి పునరావాస కేంద్రానికి తరలించేలా ఏర్పాట్లు చేస్తాం. కుక్కల బెడదను తీర్చేందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు దశల వారీగా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటాం.



## నూతన దంపతులను ఆశీర్వదించిన సీఎం జగన్

గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లా పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో పేర్నాటి రామలింగారెడ్డి కుమారుడు కౌశిక్ వివాహ కార్యక్రమానికి సీఎం జగన్ హాజరయ్యారు. మండపంలో నూతన దంపతులను సీఎం జగన్ ఆశీర్వదించారు.



# తెలుగు రాష్ట్రాల్లో మరో కీలక ప్రాజెక్టుకు పునాది



న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో మరో కీలక ప్రాజెక్టుకు బీజం పడింది. రెండు రాష్ట్రాల అనుసంధానతను మరింత బలోపేతం చేసేందుకు రెండు కొత్త సూపర్ ఫాస్ట్ రైల్వే లైన్లకు అవసరమైన సర్వేకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం - విజయవాడ - తెలంగాణలోని శంషాబాద్ మధ్యలో మొదటిది, విశాఖపట్నం - విజయవాడ - కర్నూలు మార్గంలో రెండో రైల్వే లైన్ కోసం సర్వేకు రైల్వే బోర్డు అంగీకారం తెలుపుతూ.. దక్షిణ మధ్య రైల్వేకు లేఖ రాసింది. ఈ మార్గాల్లో సూపర్ ఫాస్ట్ రైల్వే ప్రాజెక్టు చేపట్టేందుకు అవసరమైన టెక్నికల్ ఫీజిబిలిటీని ఈ సర్వే ద్వారా నిర్ణయిస్తారు. సర్వే అయిన తర్వాత ప్రాజెక్టుపై ముందుడుగు పడనుంది. ఈ రైల్వే లైన్లకు సంబంధించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పలుమార్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విణి వైష్ణవ్‌ను కలిసి, లేఖలు సమర్పించారు. ఈ సూపర్‌ఫాస్ట్ రైల్వేలైన్ ద్వారా తెలుగు రాష్ట్రాలకు చేకూరే లబ్ధి గురించి వివరించారు. ఈ నేపథ్యంలో రైల్వే బోర్డు తాజాగా ఈ రెండు రూట్లలో సూపర్ ఫాస్ట్ రైల్వే లైన్ల సర్వేకు నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కేంద్రం ఈ నిర్ణయాన్ని వెల్లడించింది. ఈ రెండు రైల్వే లైన్లు కలిసి 942 కిలోమీటర్ల మార్గంలో (గరిష్టంగా 220 kmph వేగంతో ప్రయాణించేలా) రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన సర్వే నిర్వహించనున్నారు. ఈ సర్వేను 6 నెలల్లో పూర్తిచేయనున్నారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న కేంద్రప్రభుత్వం.. అనుసంధానతను మెరుగుపరిచే దిశగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగానే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో కొత్త రైల్వే లైన్లు, రైల్వే స్టేషన్ల అభివృద్ధి, వై-ఫైలు, రూ.30వేల కోట్ల విలువైన డబ్లింగ్, ట్రిప్లింగ్ లైన్లు, వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను కేంద్రం తెలుగు రాష్ట్రాలకు అందించింది. వీటికి అదనంగా తెలంగాణలో వ్యాగన్ తయారీ %ఽ% ఓవర్‌హాలింగ్ కేంద్రాన్ని, ఎంఎంటీఎస్ (రెండోదశ), సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ, చర్లపల్లి టర్మినల్ వంటి ప్రాజెక్టులను కేంద్రం చేపడుతున్న సంగతి తెలిసిందే.

## భాజపా అధిష్టానంతో పవన్ చర్చలు జరిపారు: సుజనా చౌదరి



విజయవాడ: ఈ తొమ్మిదేళ్లలో నవభారత్ ఆవిష్కృతమైందని భాజపా నేత, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి అన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుతో కలిసి మోదీ పాలనపై కరపత్రాలను విజయవాడలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ "ఏపీ విభజన చట్టంలోని అనేక అంశాలను మోదీ అమలు చేశారు. రాష్ట్రానికి ఎయిమ్స్, విద్యా సంస్థలు, జాతీయ రహదారులు ఇచ్చారు. రాష్ట్రంలో అసమర్థ పాలన వల్ల పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగలేదు. ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం కూడా ఇవ్వట్లేదు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. రాజధాని అమరావతిని అభివృద్ధి చేయకుండా సీఎం జగన్ నాశనం చేశారు. మోదీ నిధులిచ్చినా 3 రాజధానుల పేరుతో రాష్ట్ర ప్రగతిని ఆపేశారు. పొత్తులపై మా పార్టీ అధిష్టానంతో పవన్ కల్యాణ్ చర్చలు జరిపారు. భాజపా-జనసేన పార్టీలు పొత్తుతోనే ముందుకు సాగుతున్నాయి. అధిష్ఠానం ఏం చెబితే మేం అలాగే ముందుకెళ్తాం. ఈశాన్య రాష్ట్రాలతో పోల్చితే ఏపీకి కేంద్రం ఎక్కువ సాయం చేసింది. ఈ విషయంపై ఎవరు చర్చకు వచ్చిన నేను సిద్ధంగా ఉన్నా" అని సుజనా చౌదరి అన్నారు.




రాజకీయాల్లోకి వచ్చిన కొత్తల్లో లోక్‌సభ సభ్యత్వం రద్దును తాను ఊహించలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత సంతతి వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రధానిపై బుధవారం రాహుల్ విమర్శలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్‌లో మాట్లాడుతూ "నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సమయంలో.. వేటిని ఎదుర్కోవాల్సి వస్తుందో అస్సలు ఊహించలేదు. అసలు ఇలా జరుగుతుందని (లోక్‌సభ సభ్యత్వం రద్దు) అసలు అనుకోలేదు. కానీ, ఆ తర్వాత దీనిని నాకు లభించిన పెద్ద అవకాశంగా భావించా. నాకు లభించిన వాటిల్లో ఇదే పెద్ద అవకాశం. రాజకీయాలంటే అలానే ఉంటాయి" అని అన్నారు. ఇక భారత్ జోడో యాత్రపై రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "ఈ కథ ఆరు నెలల క్రితం మొదలైంది. అప్పట్లో మేం ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిపక్షాలన్నీ చిక్కుల్లో ఉన్నాయి. అధికార పక్ష ఆర్థిక ఆధిపత్యం, సంస్థాగత పెత్తనం నడుస్తున్నాయి. మా దేశంలోనే మేం ప్రజాస్వామ్య పోరాటం చేయడానికి అవస్థలు పడుతున్నాం. ఆ సమయంలో భారత్ జోడో యాత్ర చేయాలని నిర్ణయించుకున్నాను" అని పేర్కొన్నారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో భారత్ నుంచి వచ్చిన విద్యార్థులతో సత్సంబంధాలు కొనసాగించాలని అనుకుంటున్నట్లు వెల్లడించారు. వారితో తాను ముచ్చటించడానికి ఇది మంచి సమయమని అభిప్రాయపడ్డారు. భారత్-చైనా సంబంధాలు అంత సులువుకాదని.. కఠినంగా ఉండబోతున్నాయని రాహుల్ అభిప్రాయపడ్డారు. భారత్‌ను వెనక్కి నెట్టడం చైనాకు సాధ్యం కాదని చెప్పారు. దేవుడి కంటే తమకే ఎక్కువ తెలుసని భారత్‌లో కొంతమంది భావిస్తుంటారని, అలాంటి ఓ ప్రత్యేక మనిషిగా ప్రధాని మోదీ నిలుస్తారని రాహుల్‌గాంధీ బుధవారం ఎద్దేవా చేసిన విషయం తెలిసిందే. అమెరికా పర్యటనలో భాగంగా నిన్న కాలిఫోర్నియాలోని శాంతాక్లారాలో 'ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ యూఎస్ఏ' నిర్వహించిన 'మొహబ్బత్ కీ దుకాణ్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

## మద్యపాన నిషేధం ఇప్పుడు ఎన్నో దశలో ఉందో చెప్పాలి..




విశాఖ జిల్లా: టీడీపీ మినీ మేనిఫెస్టోతో వైసీపీ నేతల గుండెల్లో రైలు పరుగెడుతున్నాయని టీడీపీ తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె విశాఖలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ మేనిఫెస్టోను 98.5 శాతం అమలు చేసామని.. మేనిఫెస్టోని పవిత్రం గ్రంథం అని చెప్పి వైసీపీ నేతలు గ్రంథం చూడడం మానేశారని ఎద్దేవా చేశారు. సంపూర్ణ మద్యపాన నిషేధం.., ఆ తర్వాత దశల వారీగా మద్యపాన నిషేధం అన్నారు... ఇపుడు ఎన్నో దశలో ఉందో చెప్పాలన్నారు. వైసీపీ నేతల బుర్రలో చిప్స్ దొబ్బాయేమో.. అన్ని అవాస్తవాలు చెబుతున్నారని మండిపడ్డారు. రోజా టీడీపీలో రాజకీయ ఓనమాలు దిద్దుకున్నారని, ఇప్పుడు వేదికలపై చిందులు వేసి.. టీడీపీని విమర్శిస్తున్నారని అన్నారు. ఏపిని గంజాయిలో నంబర్ 1గా నిలిపారని ఆరోపించారు. సంపాదించే దమ్ము ఉన్నవాడే అప్పులు చేయాలని అనిత అన్నారు. చంద్రబాబు ఒక మాట చెబితే.. ప్రపంచంలో పెట్టుబడిదారులు వస్తారని.. సంపద సృష్టించింది చంద్రబాబేనని అన్నారు. అమ్మవడిలో ఎంత మంది పిల్లలు ఉంటే... అంత మందికి ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఒక్కరికే ఇస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు 3 గ్యాస్ సిలెండర్స్ ఉచితం అన్నారు.. వైసీపీకి దమ్ముంటే 6 సిలెండర్స్ అని చెప్పాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత చంద్రబాబుదేనని.. దమ్ముంటే అభివృద్ధిపై వైసీపీ నేతలు చర్చకు రావాలని అనిత సవాల్ చేశారు. నాలుగేళ్ల కాలంలో రైతులకు ఎంత ఇచ్చారో చెప్పాలన్నారు. రైతులకు రుణ మాఫీ చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. గజని సినిమాలో హీరోలా స్పీకర్ తమ్మినేని వ్యవహారం ఉందని, ఆయన స్పీకర్ అనే విషయం గుర్తుంచుకోవాలని అనిత అన్నారు. చంద్రబాబుపై స్పీకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. గతంలో చంద్రబాబుకు సాష్టాంగ నమస్కారం పెట్టారని.. ఎల్లో షర్ట్ వేసున్న సంగతి మర్చిపోయారా? అని అన్నారు. చంద్రబాబుకు బ్లాక్ కమాండర్స్ కాదు, 75 లక్షల ఎల్లో కమాండర్స్ ఉన్నారనే సంగతి గుర్తు పెట్టుకోవాలన్నారు. ముందస్తు ఎన్నికలు వచ్చినా.. రాకపోయినా ఎన్నికలకు మేం సిద్ధమని, వచ్చే ఎన్నికల్లో టీడీపీదే విజయమని.. సైకో ఇంటికి వెళ్లడం ఖాయమని వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు.

## ముందస్తుకు వెళ్లినా... వెనకస్తుకి వెళ్లినా గెలుపు టీడీపీదే..



విశాఖ : ఏపీ సీఎం జగన్ అమరావతిలో పేద ప్రజలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న పేర్కొన్నారు. విశాఖలో దశపల్లా భూములు, వైసీపీ నేతలు దోచుకున్న భూముల్లో పేదలకు జగన్ ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అనకాపల్లి జిల్లా బయ్యారంలో వైసీపీ నేతలు అక్రమ లే అవుట్ వేశారన్నారు. 600 ఎకరాల్లో గుడివాడ అమర్, విజయ సాయి రెడ్డి బినామీలతో వెంచర్ వేశారన్నారు. గుడివాడ అమర్, విజయ సాయి రెడ్డి రికార్డులు తారుమారు చేసి...కబ్జా చేశారని ఆరోపించారు. ఎవరూ కొని మోసం పోవద్దని.. 2024 ఎన్నికల్లో వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని బుద్ధా వెంకన్న అన్నారు. "మా కృష్ణా జిల్లాలోనే కుక్కలు ఉన్నాయని అనుకున్నాను. అరిసే కుక్కలు కరవవు. అక్కడ ఊర కుక్కలకే సమాధానంచెప్పాను. బురద పందులకు సమాధానం చెప్పలేనా? సీతారాం... మా స్కూల్ నుంచి వచ్చిన వ్యక్తే.. ప్రజల సొమ్ము తిని పందిలా బలిశారు. చచ్చే వరకూ టీడీపీలో ఉంటానని సీతారాం అన్నారు. ఇప్పుడ బురద పందిలా చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారు. 2019 ఎన్నికలలో తమ్మినేని గెలిచారు. 2024 ఎన్నికలో ఓటమి ఖాయం. 2024 ఎన్నికల్లో ఆముదాలవలస రోడ్డుపై అంకుశం సినిమాలో రామిరెడ్డి లాగా తమ్మినేని రోడ్డు మీద ఉండాల్సి ఉంటుంది. వచ్చే ఎన్నికలలో తమ్మినేని పై కోన రవి కుమార్ పోటీ చేసి గెలుస్తారు. తమ్మినేని పందిలాగా బలిసి చంద్రబాబు పినిష్ చేస్తానని అంటావా? బుద్ధి ఉందా? న్యాయ వ్యవస్థను ఎవరూ మేనేజ్ చేయలేరు. తల్లి వంకతో అవినాష్ బెయిల్ తెచ్చుకున్నారు. అవినాష్ బెయిల్ విషయంలో వ్యవస్థల్ని వైసీపీవారు మేనేజ్ చేశారా? అవినాష్ కంటే జగన్ చాలా భయపడుతున్నారు. ముందస్తుకు వెళ్ళినా... వెనకస్తుకి వెళ్లినా టీడీపీ గెలుస్తుంది. కేశినేని వ్యాఖ్యలపై నేను స్పందించను. 2 వేల రూపాయల నోట్ల కట్టలు ఇడుపాయలలో దాచారు. 2 వేల నోట్లు ఎలా మార్చాలనే పనిలో జగన్ ఉన్నారు. జగన్ ది క్రిమినల్ మైండ్.. ప్రస్తుతం ఆయన డిప్రెషన్‌లో ఉన్నారు. జనాల దగ్గరకు జగన్ దేరాలు కట్టుకొని వెళ్తున్నారు. దేరా బాబు జగన్. విజయవాడ వెస్ట్ నుంచి నేను పోటీ చేస్తాను. కాని పక్షంలో ఎక్కడ నుంచి చంద్రబాబు పోటీ చేయమంటే అక్కడ నుంచే పోటీ చేస్తాను" అని బుద్ధా వెంకన్న తెలిపారు.

## చంద్రబాబుకు శుభాకాంక్షలు చెప్పిన కన్నా.. సత్తెనపల్లిలో ఎలాంటి గ్రూపులూ లేవని వెల్లడి



గుంటూరు : తనకు సత్తెనపల్లి సీటు కేటాయించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు కన్నా లక్ష్మీనారాయణ ధన్యవాదాలు తెలిపారు. తాను ఎక్కడ ఉన్నా కార్యకర్తలు, ప్రజలతోనే ఉంటానన్నారు. అభివృద్ధి ప్రాధాన్యమిస్తానన్నారు. సత్తెనపల్లిలో ఎలాంటి గ్రూపులూ లేవని కన్నా తేల్చి చెప్పారు. కోడెల కుటుంబంతో తనకు వ్యక్తిగత విభేదాలు లేవన్నారు. జిల్లాలో వ్యక్తిగతంగా తనకు ఎవరితోనూ వైరం లేదని.. అందరం కలిసి ముందుకు సాగుతామని కన్నా తెలిపారు. కన్నా లక్ష్మీనారాయణ పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సత్తెనపల్లికి ఇంతకు ముందు డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు ప్రాతినిధ్యం వహించారు. ఆయన మరణం తర్వాత అక్కడ ఎవరినీ ఇన్‌ఛార్జిగా నియమించలేదు. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ కోడెల శివ ప్రసాదరావు తనయుడు శివరాం బుధవారం సత్తెనపల్లిలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. కన్నా నియామకాన్ని నిరసించారు. కోడెల పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకొని కుటుంబ వారసుడిగా సత్తెనపల్లిలో తనకు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. టీడీపీలో కన్నా చేరాక ఆయన పెదకూరపాడు లేదంటే గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేస్తారని వార్తలొచ్చాయి. అనుహ్యాంగా చంద్రబాబు కన్నాను సత్తెనపల్లి నియోజకవర్గానికి ఇన్‌చార్జ్ గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఆయన నియామకం వెనుక పెద్ద వ్యూహమే ఉన్నట్టు తెలుస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చింది మొదలు అంబటి రాంబాబు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. అవసరమున్నా లేకున్నా.. చంద్రబాబు, పవన్‌లను టార్గెట్ చేస్తూ పెద్ద ఎత్తున విమర్శలు గుప్పిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే అంబటికి చెక్ పెట్టేందుకు కాపు సామాజిక వర్గానికి చెందిన కన్నాను అధిష్టానం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ పదవిని మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ తనయుడు శివరాం, మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు తదితరులు ఆశిస్తున్నారు. మరి వీరికి చంద్రబాబు ఎలా సర్ది చెబుతారో చూడాలి.

## 'వచ్చే ఎన్నికల్లో ఘనవిజయం దిశగా వైఎస్సార్‌సీపీ పరుగులు'

### సవాళ్లను అధిగమించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు : వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి



అమరావతి: వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక ప్రకృతి వైపరీత్యాలు, అవాంతరాలు, కష్టాలు ఎదురైనా మొక్కువోని ధైర్యంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలును నిరాటంకంగా కొనసాగిస్తున్నారని, జనురంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించడానికి వైఎస్సార్‌సీపీ ముందుకు సాగుతోందని ఆయన బుధువారం తాడేపల్లిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికల్లో కేవలం పనితీరుతో ప్రజల మనుసుల్ని గెల్చుకునే మొదటి రాజకీయపక్షంగా వైఎస్సార్‌సీపీ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతోందని తెలిపారు.

## భారత్‌లో 500 మందికి అమెజాన్ ఉద్వాసన!

దిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారత్‌లో 500 మంది ఉద్యోగులను తొలగించినట్లు సమాచారం. అంతర్జాతీయంగా తమ కంపెనీలో పనిచేస్తున్న మొత్తం 9,000 మందిని ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తున్నట్లు మార్చిలో అమెజాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే భారత్‌లో 500 మందిని ఇంటికి పంపినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తి ఒకరు తెలిపారు. వెబ్‌సర్వీసెస్, హ్యూమన్ రీసోర్సెస్, సపోర్ట్ డిపార్ట్‌మెంట్ నుంచి ఉద్యోగులను తొలగించినట్లు తెలుస్తోంది. వీరిలో కొంత మంది కంపెనీ గ్లోబల్ ఆపరేషన్స్‌కు ఇక్కడి నుంచి పనిచేస్తున్న వారున్నారు. ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అస్థిరత నేపథ్యంలో ప్రాధాన్యాలకు అనుగుణంగా ఉద్యోగులను పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించినట్లు సీఈఓ ఆండీ జస్సీ మార్చిలో వెల్లడించిన విషయం తెలిసిందే. కరోనా తర్వాత ఈ-కామర్స్ కంపెనీల ఆదాయాల్లోవృద్ధి నెమ్మదించింది. మరోవైపు మహమ్మారి సంక్షోభ సమయంలో డిమాండ్ పెరగడంతో అందుకు అనుగుణంగా భారీ ఎత్తున ఉద్యోగులను నియమించున్నాయి. కానీ, కరోనా పూర్వస్థితికి వ్యాపార కార్యకలాపాలు చేరుకోవడంతో డిమాండ్ మళ్లీ తగ్గింది. మరోవైపు మాంద్యం, వడ్డీరేట్ల పెంపు నేపథ్యంలో వినియోగదారులు కొనుగోలు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఫలితంగా చాలా కంపెనీలు వ్యయాలను నియంత్రించుకుంటాయి. అందులో భాగంగా మెటా, గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. జనవరిలోనూ అమెజాన్ 18,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది.

## బాబాయ్ హంతకులకు అండగా ఉన్న జగన్ రెడ్డికి క్రెడిబులిటి లేదు



అమరావతి : బాబాయ్ వైఎస్ వివేకా హంతకులకు అండగా ఉన్న సీఎం జగన్ రెడ్డికి క్రెడిబులిటి లేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బోండా ఉమ అన్నారు. ఊరికో హామీ ఇచ్చి ప్రజల నెత్తిన టోపీ పెట్టినోడు జగన్ రెడ్డి అని విమర్శించారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో టీడీపీ అధినేత చంద్రబాబును పేదల పెన్నిధి అంటున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను చూసి వైసీపీకి దడ పుడుతోందన్నారు. కళ్ళ ముందు ఓటమి కనపడుతోందన్నారు. వైసీపీకి 175 మంది అభ్యర్థులు లేరని.. వైసీపీకి వుంటే జగన్ రెడ్డి వెంటనే ప్రకటించాలన్నారు. ప్రశాంత్ కిషోర్ సర్వేలో వైసీపీ ఓటమి తప్పదు అని తేలిందని.. అందుకే జగన్ రెడ్డి ఉలిక్కి పడుతున్నాడని బోండా ఉమ పేర్కొన్నారు.

## హాలీవుడ్ 'ఎఫ్-9' స్టార్ తో పీసీ రొమాన్స్!

హాలీవుడ్ లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. 'సీటాడెల్' సిరీస్ కోసం ప్రపంచ దేశాల్నే చుట్టేస్తుంది. ఈ సిరిస్ సక్సెస్ అయితే అమ్మడి క్రేజ్ వరల్డ్ వైడ్ మరింత రెట్టింపు అవుతుంది. ఇప్పటికే ఓ వైపు హాలీవుడ్ సినిమాల తో..మరోవైపు అవార్డు వేడుకల్లో భాగంగా ప్రపంచ వేదికల్నే అబ్బుర పరిచింది. ఓ భారతీయ నటి విదేశాల్లో అంతగా ఫేమస్ అవ్వడం అన్నది సినిమా చరిత్రలో మొట్ట మొదటిసారి. కొన్ని కారణాలతో భారతీయులు ఆమెని వ్యతిరేకించినా? భారతదేశం గురించి విదేశాల్లోనూఏ ఎలుగెత్తు చాటిన నటిగా చెప్పొచ్చు. 'క్వాంటికో' నుంచి 'సీటాడెల్' వరకూ పెద్ద తెర..బుల్లి తెరను సైతం ఏలేసింది. ఇప్పుడు



ఏకంగా వరల్డ్ ఫేమస్ స్టార్స్ తో కలిసి సినిమాలు చేస్తుంది. త్వరలో 'ఎఫ్ -9' స్టార్ తో ఓ సినిమా చేస్తుంది. ఎవెంజర్స్ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన ఇద్రిస్ ఎల్బా.. ఎఫ్ -9 సినిమాలో నటించిన జాన్ సెనాతో కలిసి పీసీ రొమాన్స్ చేయబోతుంది. 'హెడ్స్ ఆఫ్ స్టేట్' అనే సినిమాలో ఈ త్రయం కనిపించనుంది.

ఈ చిత్రాన్ని ఇలియా నైషుల్లర్ తెరకెక్కిస్తున్నారు. పీటర్ సఫ్రాన్.. జాన్ రికార్డర్ ఈసినిమాని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో అవకాశం పట్ల ప్రియాంక చోప్రా ఎంతో ఎగ్జైట్ మెంట్ ఫీలైంది. అరుదైన నటులుతో..అరుదుగా నటించే అవకాశం వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేసింది. 'సీటాడెల్' తర్వాత నేను చేయబోతున్న ప్రాజెక్ట్ అంటూ గర్వంగా ప్రకటించింది. అలాగే భారతదేశంలో 'సీటాడెల్' కోసం ప్రత్యేకంగా ప్రచారం లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సీటాడెల్ రిలీజ్ తర్వాత ప్రపంచ మంతా పర్యటిస్తామని తెలిపారు. మొత్తానికి ప్రియాంక రేంజ్ హాలీవుడ్ లో రోజు రోజుకి పెరిగిపోతుందని చెప్పొచ్చు. హాలీవుడ్ లో సినిమా ఛాన్స్ అంటే అంత ఈజీ కాదు. ఎంతో అనుభవంతో పాటు..చాలా విషయాల పట్ల అవగాహన ఉంటే గానీ రాని అవకాశాలు. పీసీ తర్వాత అలాంటి అవకాశాలు తెలుగు నటుడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కి వస్తున్నాయి. 'ఆర్ ఆర్ ఆర్' సక్సెస్ కం గుర్తింపుతో హాలీవుడ్ మేకర్స్ స్వయంగా చరణ్ కి ఆహ్వానం పలుకుతోన్న సంగతి తెలిసిందే.

## నాగార్జున డ్యూయల్ రోల్.. కానీ ఆ ఒక్కటి సస్పెన్స్!

కింగ్ నాగార్జునకి ద్విపాత్రాభినయం కొత్తేం కాదు. హీరోగా ఎంట్రీ ఇచ్చిన కొత్తలోనే డ్యూయల్ రోల్ లో కనిపించారు. అటు పై అవసరం మేర పలు సినిమాల్లో ఆ తరహా పాత్రల్లో మెప్పించిన సందర్భాలెన్నో. రీసెంట్ విజయాల్లో 'సొగ్గాడే చిన్ని నాయనా' ఒకటి. ఈ సినిమాలో నాగ్ ద్విపాత్రాభినయం ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేసింది. సినిమా విజయంలో నాగ్ రెండు పాత్రలు ఎంతో కీలక పాత్ర పోషించాయి. ఈ నేపథ్యంలో నాగార్జున మరోసారి కొత్త సినిమాలోనూ ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు తెలుస్తోంది. రచయిత బెజవాడ ప్రసన్న కుమార ని దర్శకుడిగా పరిచయం చేస్తూ నాగార్జున ఓ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇది పిరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ సినిమా. ఇటీవల ఈ జానర్ సినిమాలకు ఆదరణ బాగుండటంతో? సినిమా పై అంచనాలు భారీగా ఏర్పడుతున్నాయి. ఇందులో నాగార్జున రెండు విభిన్న పాత్రలు పోషిస్తున్నట్ల తెలుస్తుంది. అందులో ఓ పాత్ర మధ్య వయస్కుడిగా నటిస్తున్నట్లు సమాచారం.



అంటే 40-50 ఏఊళ్ల వయసున్న పాత్రలో తెలుస్తుంది. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకంగా ఉంటుందని యూనిట్ వర్గాల సమచారం. ఇదే పాత్రలో గ్రేషేడ్ కూడా కనిపిస్తుందిట. ఆ పాత్ర లుక్ మాసివ్ గా ఉంటుందని తెలుస్తుంది. ఆ పాత్రకి సంబంధించిన గెటప్ కోసం విదేశీ నిపుణులు పనిచేస్తున్నారుట. అయితే మరో పాత్రకి సంబంధించి ఎలాంటి అప్ డేట్ ఇంతవరకూ లీక్ అవ్వలేదు. దీంతో ఆ రోల్ ఎలా ఉండబోతుంది? అన్న ఎగ్జైట్ మెంట్ అభిమానుల్లో కనిపిస్తుంది. ఇటీవలి కాలంలో కంటెంట్ పరంగా నాగార్జున చాలా సెలక్టివ్ గా వెళ్తోన్న సంగతి తెలిసిందే. రొటీన్ కిభిన్నమైన సినిమాలు చేస్తున్నారు. పాత్రల పరంగా వైవిధ్యం కోరుకుంటున్నారు. ప్రసన్న కుమార్ ఆ కోవలోనే అక్కినేని కాంపౌండ్ లోకి రాగలిగారు. కింగ్ ని తన కథతో మెప్పించగలిగారు. ఇందులో ఓ పాత్రకి జోడీగా మాజీ మిస్ ఇండియా మానస వారణాసి నటిస్తోంది. మరో హీరోయిన్ కి ఛాన్స్ ఉంది. కానీ ఇంకా యూనిట్ కన్ఫమ్ చేయలేదు. ఈ చిత్రాన్ని శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు.




## స్టన్నింగ్ క్లీ వేజ్ షో తో జాన్వీ కపూర్ షాక్





అతిలోక సుందరి శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి చాలా సినిమాల్లో నటించింది. కానీ ఇప్పటి వరకు హిందీలో ఈమె నటించిన సినిమాలు లేదా సిరీస్ ల్లో ఏ ఒక్కటి కూడా కమర్షియల్ గా హిట్ అవ్వలేదు. అయితే ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఫోటో షూట్స్ తో పాన్ ఇండియా స్టార్ డమ్ ను దక్కించుకుంది. సినిమాలతో కంటే ఫోటో షూట్స్ తో ఎక్కువ పాపులారిటీని సొంతం చేసుకున్న హీరోయిన్ గా జాన్వీ కపూర్ నిలిచింది. ప్రస్తుతం ఎన్టీఆర్ కు జోడీగా కొరటాల శివ దర్శకత్వంలో నటిస్తుంది అంటే అది కేవలం ఇలాంటి హాట్ ఫోటోలను మరియు వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడమే అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

హాట్ ఫొటోల వల్ల మంచి పేరు వస్తుందనే ఉద్దేశ్యంతో జాన్వీ కపూర్ రెగ్యులర్ గా తన ఫొటో ల జోరు.. వేడి పెంచుతూనే ఉంది. ఆకట్టుకునే ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు కూడా ఫిదా అవుతున్నారు. తాజాగా మరోసారి క్లీవేజ్ షో తో మతి పోగొట్టింది. ఖరీదైన స్టైలిష్ హారంను ధరించిన జాన్వీ కపూర్ క్లీ వేజ్ షో తో చూపు తిప్పుకోవడం లేదు. మెడలో ఉన్న ఖరీదైన హారం కంటే కూడా ఆమె క్లీవేజ్ షో మరియు ఆమె చూపులు స్టన్నింగ్ గా ఉన్నాయంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ ఫొటోలు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు.

ఎన్టీఆర్ 30 సినిమా చిత్రీకరణ ఇటీవలే ప్రారంభం అయింది. వచ్చే షెడ్యూల్ లో జాన్వీ కపూర్ ఎన్టీఆర్ 30 సెట్స్ లో జాయిన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటూ వార్తలు వస్తున్నాయి. శ్రీదేవి కి అందం విషయంలో తల్లికి తగ్గ కూతురు అనిపించుకుంటుంది అనడంలో సందేహం లేదు. ఎన్టీఆర్ 30 సినిమా తర్వాత సౌత్ లో జాన్వీ కపూర్ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## 15 అంతస్తుల టవర్ నిర్మిస్తున్న స్టార్ కపుల్





అలియా భట్ ప్రస్తుతం అనేక విధులు నిర్వహిస్తోంది. వాటిలో ఒకటి డ్రీమ్ హౌమ్ (కలల ఇల్లు) నిర్మాణంలో పురోగతి పరిశీలన. ఆమె వారి కొత్త నివాసం నిర్మాణ స్థలం నుండి తిరిగి వస్తున్నట్లు కనిపిస్తున్న కొన్ని ఫోటోలు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అలియా చాలా సింపుల్ గా క్యాజువల్ స్ట్రీట్ వేర్ లుక్ లో కనిపించింది. ఆమె బేసిక్ వైట్ ట్యాంక్ టాప్ ను- బ్యాగీ జీన్స్ సన్ గ్లాసెస్ తో స్టైలిష్ గా కనిపించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. RRR నటిగా ఆలియా పేరు ఇటీవల మార్మోగుతోంది. అలియా - రణబీర్ ప్రస్తుతం తమ కుమార్తె రాహాతో కలిసి వారి కుటుంబ గృహమైన వాస్తులో నివసిస్తున్నారు. నిజానికి డిసెంబర్ 2022లో అలియా- రణబీర్ నిర్మాణ సైట్ నుండి తీసుకున్న స్నాప్ లు ఇంటర్నెట్ లో వైరల్ అయ్యాయి. నిర్మాణంలో ఉన్న ప్రాపర్టీని తనిఖీ చేస్తున్న సమయంలో వీరిద్దరూ అపార్ట్ మెంట్ లోని బాల్కనీలో కనిపించారు. ఆలియా టీమ్తో కలిసి ఇంటి గురించి ప్రశ్నిస్తూ కనిపించింది. మరోవైపు రణబీర్ కపూర్ సైట్ కి సంబంధించిన కొన్ని ఫోటోలను క్లిక్ చేశాడు. బాంద్రాలోని 15-అంతస్తుల టవర్ లో ఈ జంట కపూర్ కుటుంబానికి ఐదు అంతస్తులు కేటాయించినట్లు తెలుస్తోంది. మొత్తం భవంతి నిర్మాణం పూర్తి కావడానికి ఆరు సంవత్సరాలు పడుతుంది. అయితే మొదటి 5 అపార్ట్మెంట్లు ప్రాసెస్ లో ఉన్నాయి. టవర్ మొదటి - రెండవ అంతస్తుల అపార్ట్ మెంట్ లు దాదాపు నివాసానికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి వరుసగా రణబీర్ కపూర్-ఆలియా భట్ - నీతూ కపూర్లకు చెందినవిగా భావిస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఆలియా భట్ రణబీర్ థియేట్రికల్ హిట్ బ్రహ్మాస్త్రలో కలిసి కనిపించారు. రణబీర్ చివరిసారిగా లవ్ రంజన్ కమర్షియల్ రొమాంటిక్ కామెడీ తు ఝూతి మైన్ మక్కార్ లో కనిపించాడు. తొలిసారి శ్రద్ధా కపూర్ అతడి సరసన నటించింది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుండి మిశ్రమ స్పందన లభించింది. ఆ తర్వాత రణబీర్ యానిమల్ అనే చిత్రంలో నటించనున్నాడు. గతంలో షాహిద్ కపూర్ కబీర్ సింగ్ చిత్రానికి దర్శకత్వం వహించిన సందీప్ రెడ్డి వంగా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అలియా గురించి చెప్పాలంటే... ఆమె త్వరలో కరణ్ జోహార్ దర్శకత్వంలో రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీలో కనిపించనుంది.

బ్లాక్ బస్టర్ గల్లీ బాయ్ తర్వాత ఆమె రెండోసారి రణ్ వీర్ సింగ్ తో జతకట్టనుంది. OTT చిత్రం హార్ట్ ఆఫ్ స్టోన్ ద్వారా అలియా హాలీవుడ్ లోకి దూసుకెళుతోంది. గాల్ గాడోట్ - జామీ డోర్నన్ లతో కలిసి స్పేస్ నేపథ్యంలోని ఈ మూవీలో నటిస్తోంది. ప్రియాంక చోప్రా - కత్రినా కైఫ్ లతో కలిసి నటించిన జీ లే జరా ఆలియా ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ లలో మరొకటి.

**రామ్ చరణ్-ఉపాసనకు ఆలియా గిఫ్ట్ :** రామ్చరణ్-ఉపాసన తల్లిదండ్రులు కాబోతున్న వేళ ఈ జంటకు అరుదైన కానుకను పంపించింది ఆలియా భట్. ఆలియా Ed-a-Mamma వస్త్ర శ్రేణికి బ్రాండ్ అంబాసిడర్గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఎన్టీఆర్ పిల్లలకు దుస్తులు పంపించిన ఆలియా ఇప్పుడు రామ్ చరణ్ సతీమణి ఉపాసన కోసం అద్భుతమైన కానుకను పంపింది. ఈ జంటకు పుట్టబోయే బేబీకి సంబంధించిన దుస్తులను ఆలియా పంపించింది. ఈ విషయాన్ని స్వయంగా ఉపాసన సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ ఆలియాకు థ్యాంక్స్ చెప్పారు. ఆలియా ఆర్.ఆర్.ఆర్ లో చరణ్ సరసన సీత పాత్రలో నటించిన సంగతి తెలిసిందే.

## ఇన్ సైడ్... సమంత ఆ న్యూడ్ సీన్స్ కు ఓకే చెప్పిందా?

ప్రియాంక చోప్రా.. రిచర్డ్ మాడెన్ ముఖ్య పాత్రల్లో నటించిన హాలీవుడ్ సిరీస్ 'సిటాడెల్' ను ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 28వ తారీకున స్ట్రీమింగ్ చేయబోతున్నారు. తాజాగా సిటాడెల్ యొక్క ట్రైలర్ ను విడుదల చేయడం జరిగింది. ట్రైలర్ లో ప్రియాంక చోప్రా కొన్ని టాప్ లెస్ న్యూడ్ బ్యాక్ తో కనిపించింది. కొన్ని రొమాంటిక్ సన్నివేశాల్లో కూడా కనిపించబోతున్నట్లుగా ట్రైలర్ ను చూస్తూ అర్థం అవుతుంది. సిటాడెల్ ను ఇంగ్లీష్.. హిందీ తో పాటు ఇతర సౌత్ ఇండియన్ భాషల్లో విడుదల స్ట్రీమింగ్ చేయబోతున్నట్లుగా అమెజాన్ ప్రైమ్ అధికారికంగా ప్రకటించింది. ఇదే సమయంలో సిటాడెల్ ను హిందీలో వరుణ్ ధావన్.. సమంత ప్రధాన పాత్రల్లో రీమేక్ చేస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కార్యక్రమాలు కూడా జరిగినట్లు సమాచారం అందుతోంది. ఒరిజినల్ సిటాడెల్ కు చాలా మార్పులు చేర్పులు చేసి



హిందీలో రీమేక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రియాంక చోప్రా యాక్షన్ సన్నివేశాలతో పాటు రొమాన్స్ సన్నివేశాల్లో రెచ్చి పోయింది. కనుక ఆమె పాత్రలో నటించబోతున్న సమంత కూడా ఆ సన్నివేశాల్లో కనిపించబోతుందా అంటూ ఇప్పుడు సోషల్ మీడియాలో మరియు మీడియా వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇండియా ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా ఆ సన్నివేశాలను మార్చే అవకాశాలు ఉన్నాయి అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొందరు మాత్రం సమంత ఆ సెమీ న్యూడ్ సన్నివేశాల్లో నటించేందుకు ఓకే చెప్పిందనే వార్తలు వస్తున్నాయి. గ్రాఫిక్స్ ను ఉపయోగించి ఆ సన్నివేశాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సమంత గత సిరీస్ ఫ్యామిలీ మ్యాన్ లో కాస్త ఎక్కువ బోల్డ్ గానే నటించింది. కనుక ఈ సిరీస్ లో అలా నటించడం లో ఇబ్బంది ఏమీ లేదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం సమంత యొక్క శాకుంతలం సినిమా యొక్క హడావుడి కొనసాగుతోంది. ఆ తర్వాత సిటాడెల్ సిరీస్ కు సంబంధించి సమంత హడావుడి మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయి.

## ఆ ఇద్దరితో నయనతార టెస్ట్ ఆడుతుందా?

లేడీ సూపర్ స్టార్ గా నయనతార కెరీర్ దేదీప్యమానంగా సాగిపోతుంది. సూపర్ స్టార్లే ఆమె డేట్లు కోసం ఎదురుచూస్తున్నారు? అంటే సన్నివేశం ఎలా ఉందో అర్థమవుతుంది. నాటి రోజుల్లో సావిత్రి డేట్లు కోసం అప్పటి హీరోలు వెయిట్ చేసేవారు. ఆ తర్వాత తరం నటీమణుల్లో ఎవరి పేరు అంతగా ఖ్యాతికెక్కలేదు. తాజాగా నేటి తరం జనరేషన్ లో నయనతార పేరు మాత్రం యమా బిజీ హీరోయిన్ గా వినిపిస్తుంది. కేవలం తమిళ సినిమాలు తప్ప! ఇతర భాషల్లో సినిమాలు చేయడం చాలా అరుదుగానే కనిపిస్తుంది. షారుక్ ఖాన్ ఏరికోరి మరి 'జవాన్' కోసం ఎంపిక చేసారు. అందుకు భారీగా పారితోషికం చెల్లించి ప్రాజెక్ట్ లోకి తెచ్చారు. షారుక్ ఖాన్ కి ఉన్న ఇమేజ్ అంత అవసరమా? అంటే తమిళ్ లో మార్కెట్ చేయాలంటే? నయన్ తప్పనిసరిగా ఉండాల్సిందే అన్న కోణంలో లాక్ చేసారు. అదీ నయన్ రేంజ్ ఇప్పుడు. ఇటీవలే నయన్ 'కనెక్ట్' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. కానీ ఫలితం ఆశించిన విధంగా రాలేదు.



దీంతో కాస్త నిరుత్సాహం తప్పలేదు. దీంతో నయనతార తర్వాతి సినిమా పై ఆసక్తి నెలకొంది. కొత్త సినిమా ప్రకటన ఎప్పుడొస్తుందా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆ గుడ్ న్యూస్ వచ్చేసింది. ఈసారి ఏకంగా ఇద్దరి హీరోలతో రొమాన్స్ కి రెడీ అయింది. మాధవన్ ..సిద్దార్ధ్ లతో కలిసి 'టెస్ట్' అనే సినిమా చేస్తుంది. వై నాట్ స్టూడియోస్కు చెందిన శశికాంత్ దర్శకత్వం వహించ నున్నారు. దర్శకుడిగా అతనికిదే తొలి సినిమా. చాలా కాలం పాటు నిర్మాతగా సేవలందించారు. ఇక పై క్రియేటివ్ గానూ రాణించాలని దర్శకుడిగా టర్న్ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ చివరి నాటికి సినిమా పట్టాలెక్కనుందని సమాచారాం. మరి ఇద్దరితో నయనతార టెస్ట్ ఎలా ఆడుతుందో చూడాలి. అలాగే టెస్ట్ రొమాంటిక్ జోనరా? కామెడీ జానర్? అన్నది ఇంకా ఖరారు కాలేదు.సిద్దార్థ్- మాధవన్ కలసి గతంలో రెండు సినిమాలు చేశారు. 'రంగ్ దే బసంతి'- 'యువ' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. శశికాంత్ గతంలో అనేక సినిమాలను నిర్మించారు. 'విక్రమ్ వేద'- 'మండేలా'- 'సూపర్ డీలక్స్' వంటి చిత్రాలతో బ్లాక్ బస్టర్ ప్రొడ్యూసర్ గా పేరుంది. టెస్ట్ తో కెప్టెనీ కుర్చీ బాధ్యతలు ఎంతవరకూ నెరవేరుస్తారో? చూడాలి.




# పెద్ద ట్విస్టే ఇది..!

ఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణంలో నిందితుడు, అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రా రెడ్డి అప్రూవర్‌గా మారారు. సీబీఐ ప్రత్యేక కోర్టులో ఈ మేరకు ఆయన అభ్యర్థన దాఖలు చేశారు. శరత్ చంద్రారెడ్డి అభ్యర్థనకు కోర్టు సైతం అనుమతి ఇచ్చింది. ఇప్పటికే కవిత మాజీ ఆడిటర్ బుచ్చిబాబు అప్రూవర్‌గా మారారు. గత ఏడాది నవంబర్‌లో అరెస్ట్ అయిన శరత్ చంద్రారెడ్డి ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. కాగా తాను అప్రూవర్‌గా మారేందుకు అనుమతించాలని సీబీఐ కోర్టును ఆయన నేడు కోరారు. శరత్ చంద్రా రెడ్డి అప్రూవర్‌గా మారనున్నారంటూ వార్తలు ఇప్పటికే వచ్చాయి. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ఆయనకు వై కేటగిరీ భద్రత కల్పించనుందని.. ఈ మేరకు హోం శాఖ ఆదేశాలు జారీ చేసిందని సైతం ప్రచారం జరిగింది. ఈ పరిణామంతో, సీఎం కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవిత పేరు ఢిల్లీ మద్యం స్కాంలో మరోసారి తెరపైకి రానుందా!? అనేది ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏపీ సీఎం జగన్ ఆదివారం రాత్రి కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వారి మధ్య ఢిల్లీ మద్యం స్కాం అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే, స్కాంలో నిందితుడైన శరత్ చంద్రా రెడ్డి అప్రూవర్‌గా మారనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆయనకు వై కేటగిరీ భద్రతను కల్పించాలని హోం శాఖ ఆదేశించినట్లు వివరించాయి. ఆయన అప్రూవర్‌గా మారి కుంభకోణంలో కవిత పాత్రను వెల్లడించే అవకాశాలున్నాయని ఆ వర్గాలు చెప్పాయి. ఢిల్లీ మద్యం వ్యాపారంలో సౌత్ గ్రూప్ తరఫున పాల్గొన్న వారిలో కవిత, వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఆయన కుమారుడు రాఘవ రెడ్డి, వ్యాపారస్తుడు అరుణ్ రామచంద్ర పిళ్లై, కవిత మాజీ ఆడిటర్ బుచ్చిబాబు గోరంట్ల, శరత్ చంద్రారెడ్డి ఉన్న విషయం తెలిసిందే. కవిత ప్రేరణతోనే తాను మద్యం వ్యాపారంలో పాల్గొన్నానని శరత్ చంద్రా రెడ్డి చెప్పే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే గోరంట్ల బుచ్చిబాబు అప్రూవర్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పుడు శరత్ చంద్రా రెడ్డి కూడా అప్రూవర్‌గా మారడంతో కవిత పేరు మరోసారి తెరపైకి వచ్చే అవకాశం ఉంది. నిజానికి, స్కాంలో కవిత లావాదేవీల సమాచారం ఉన్నా కేంద్రం తగిన చర్యలు తీసుకోవడం లేదని రాష్ట్ర బీజేపీ నేతలు పలువురు ఢిల్లీ పెద్దలకు అనేక సార్లు చెప్పారు. కేసీఆర్ కుటుంబాన్ని కేసుల వలయంలో ఇరికిస్తే తప్ప బీఆర్ఎస్ బలహీనం కాదని, బీజేపీకి అవకాశాలు దక్కవని చెబుతూ వచ్చారు. ఢిల్లీలో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఏదో అవగాహన ఉందనే ప్రచారం జరుగుతోందని, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మడం మొదలు పెట్టారని, కవిత అరెస్టు అయితేనే బీజేపీపై నమ్మకం పెరుగుతుందని ఇటీవల బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.



# బోనాల ఉత్సవాలకు ప్రైవేట్ ఆలయాలకు సర్కార్ ఆర్థిక సాయం

## దరఖాస్తు చేసుకోవాలన్న మంత్రి తలసాని

హైదరాబాద్: రాష్ట్ర పండుగ బోనాలు ఉత్సవాలు మరికొద్ది రోజుల్లో ప్రారంభంకానున్న నేపథ్యంలో ప్రైవేటు దేవాలయాలకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం వారం రోజుల్లో ఆలయ కమిటీలు దరఖాస్తులు అందజేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

ఆషాడ బోనాల ఉత్సవాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.15 కోట్లను కేటాయించారు. బోనాల నిర్వహణ కోసం ప్రతి ఏటా ప్రైవేటు దేవాలయాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ వస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. బోనాలకు ముందే ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. కాగా.. ప్రతి సంవత్సరం గోల్కొండలో బోనాల ఉత్సవాలు ప్రారంభమైన తర్వాత సికింద్రాబాద్ బోనాలు, ఓల్డ్ సిటీ బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఈ ఏడాది జూన్ 22న గోల్కొండలో ఆషాఢ బోనాలు ప్రారంభంకానున్నాయి. ఆ తరువాత జూలై 9న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు, 16న పాతబస్తీ బోనాలు, 17న ఉమ్మడి దేవాలయాల ఆధ్వర్యంలో ఊరేగింపులు జరుగనున్నాయి. బోనాలు పండుగ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని దేవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబుకానున్నాయి.

# తెలంగాణ కన్నా ఉత్తమ పాలన ఏ రాష్ట్రంలో ఉందో చెప్పాలి : మంత్రి కేటీఆర్ సవాల్



హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రతిపక్షాలపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్ర ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలకు కేటీఆర్ సవాల్ విసిరారు. తెలంగాణ కన్నా ఉత్తమ పాలన ఏ రాష్ట్రంలో ఉందో చెప్పాలి. తెలంగాణ కన్నా మెరుగైన మోడల్ రాష్ట్రాన్ని చూపించాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. 75 ఏండ్లు పాలించిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు ఏం చేశాయి. మేం 9 ఏండ్లలో అభివృద్ధిలో అద్భుతాలు చేసి చూపించాం. బీజేపీ, కాంగ్రెస్ పరిపాలన కొత్త సీసాలో పాత సారా మాదిరి. కేంద్ర మంత్రులు టాయిలెట్స్, రైల్వేస్టేషన్లలో లిఫ్ట్‌లు ఓపెన్ చేస్తున్నారు. మేం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టులు కడుతున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు. మీడియాతో చిట్ చాట్ సందర్భంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**తెలంగాణ విజయం సాధించింది..** తెలంగాణ గత 10 ఏండ్లుగా నీళ్లు, నిధులు, నియామకాలన్న స్ఫూర్తికి అనుగుణంగా పని చేస్తోంది అని కేటీఆర్ తెలిపారు. అందులో తెలంగాణ విజయం సాధించింది. సమగ్ర, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధి సాధించింది. విద్య, వైద్య రంగంలో తెలంగాణలో అద్భుతమైన మార్పులు సాధించింది. మెడికల్ కాలేజీల ఏర్పాటుతో సమగ్రమైన మార్పు వచ్చింది.

విద్యారంగంలో గుణాత్మకమైన మార్పు సాధించాం. తెలంగాణలో పరిపాలన సంస్కరణలు దేశంలో ఎక్కడా లేవు. అన్ని రంగాల్లో తెలంగాణ తనదైన మార్క్‌ను చాటింది. తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తోంది అని కేటీఆర్ వివరించారు.

**అసత్య ఆరోపణలతో కాలం వెళ్లదీస్తున్నారు..** రాష్ట్రంలోని ప్రతిపక్షాలకు పని లేకుండా పోయింది అని కేటీఆర్ ధ్వజమెత్తారు. 9 ఏండ్లుగా ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రతిపక్షాలు చేసే ఆరోపణల్లో హేతుబద్ధత లేదు. చేతిలో ఉన్న రూపాయిని పారేసి చిల్లర ఏరుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. చిల్లర రాజకీయాలు చేసే నాయకులను ప్రజలు పట్టించుకోరు. మన పాలనను ఇతర రాష్ట్రాల పాలనతో బేరీజు వేసుకోవాలి. ఒకప్పుడు పంటలు పండని చోట నేడు ధాన్యం ఎక్కువైన పరిస్థితి నెలకొంది. ధాన్యం కొంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# అసద్ వ్యాఖ్యలపై స్పందించాల్సిన అవసరం లేదు



హైదరాబాద్: ఎంఐఎం అధినేత అసదుద్దీన్ చేసిన వ్యాఖ్యలపై పెద్దగా స్పందించాల్సిన అవసరం లేదని... అది బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంల అంతర్గత వ్యవహారమని బీజేపీ నేత విజయశాంతి అన్నారు. సయామీ ట్రిప్లెట్స్‌పై మూడు పార్టీలు కూడా ఎన్నికల ముందో తర్వాతో పొత్తో – కూటమో, సర్దుబాటో అనేది వారికే తెలుస్తుందన్నారు. స్టీరింగ్ తమ చేతిలో ఉంటే దేవాలయాలకు కోట్ల రూపాయల కేటాయింపు ఎట్లా జరుగుతది అన్న ఓవైసీజీ కామెంట్ మాత్రం పరిశీలించాల్సిన అంశమన్నారు.

తమ్ముడు ఈటెల మంత్రిగా కూడా జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ప్రగతిభవన్ గేటు దాటలేదని... కానీ బైక్‌పై వచ్చిన ఎంఐఎం వంటి టీఆర్ఎస్ సయామీలు లోనికి గౌరవంగా వెళ్లగలుగుతారని వ్యాఖ్యలు చేశారు. ఇది ఏ విధమైన అవగాహన అనేది తెలంగాణ ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ స్టీరింగ్ మా ఎంఐఎం చేతుల్లో ఉన్నదని గతంలో ఎంఐఎం చెప్పింది వాస్తవమని... ఆ వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎన్నడూ ఖండించలేదన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ స్టీరింగ్ తమ చేతుల్లో లేదని ఎంఐఎం ఎన్నికల సంవత్సరంలో చెబుతుందని... దానిపై బీఆర్ఎస్ ఎలా స్పందిస్తుందో తెలియదన్నారు. కాంగ్రెస్ పార్టీ అంపైర్‌గా ఎంఐఎం, టీఆర్ఎస్ చేస్తున్నది కేవలం షాడో బాక్సింగ్ అంతే అంటూ విజయశాంతి వ్యాఖ్యలు చేశారు.

# సిద్ధిపేటలో రైల్వేట్రాక్ పనులను పరిశీలించిన మంత్రి హరీష్‌రావు



సిద్ధిపేట: సిద్ధిపేట శివారు మందపల్లి నుంచి రైల్వే ట్రాక్ లైను పనులు రాష్ట్ర ఆర్థిక, వైద్యఆరోగ్య మంత్రి హరీష్‌రావు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, రైల్వే శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ సంతోష్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమరాజు, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ జనార్ధన్ బాబు, సిద్ధిపేట ఆర్డీఓ రమేశ్ బాబు, ఇతర అధికార యంత్రాంగంతో కలిసి క్షేత్రస్థాయి రైల్వే ట్రాక్ పనులను మంత్రి పరిశీలించారు. సిద్ధిపేటకు తొందరలోనే రైలు కూత వచ్చేలా యుద్ధప్రాతిపదికన రైల్వే ట్రాక్ పనులు పూర్తి చేయాలని రైల్వే శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. సిద్ధిపేట రైల్వే ట్రాక్ నిర్మాణ పనుల్లో జాప్యం జరగొద్దని, పనుల వేగం పెంచాలని రైల్వే శాఖ అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దుద్దెడ – సిద్ధిపేట వరకూ రైల్వే ట్రాక్ నిర్మాణ పనులలో భాగంగా చేపట్టిన ట్రాక్ నిర్మాణ పనుల గురించి మంత్రికి రైల్వే శాఖ అధికారులు వివరించారు. దుద్దెడ – సిద్ధిపేట రైల్వే ట్రాక్ పనులలో భాగంగా మందపల్లి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ జాప్యంపై ఆరా తీసి, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని రైల్వే శాఖ అధికారులను మంత్రి హరీష్‌రావు ఆదేశించారు.

# గోల్కొండ కోటలో తెలంగాణ వారోత్సవాలు.. ఏర్పాట్లను పరిశీలించిన కిషన్‌రెడ్డి



హైదరాబాద్: కేంద్రం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం గోల్కొండ కోటలో ఏర్పాట్లను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పరిశీలించారు. చారిత్రాత్మక గోల్కొండ కోటలో తెలంగాణ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని కేంద్రమంత్రి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారందరూ ఈ వేడుకలు హాజరవుతారన్నారు. మోడీ తొమ్మిదేళ్ళ పాలనకు సంభందించి ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 1200 ఆత్మ బలిదానాలతో తెలంగాణ ఏర్పాటు అయ్యిందన్నారు. సుష్మ స్వరాజ్ తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమానికి బీజేపీ ముందుండి నడిచిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఢిల్లీలో నిరసన తెలుపుతుంటే జంతర్ మంతర్‌లో కాంగ్రెస్ పార్టీ తమపై రెండుసార్లు లాఠీ ఛార్జ్ చేసిందన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గత సంవత్సరం ఘనంగ నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# మాదాసీ కురువలకు కూడా గొర్రెల యూనిట్ల పంపిణీ : మంత్రి తలసాని

హైదరాబాద్ : రాష్ట్రంలోని ఆయా కులవృత్తుల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ పలు పథకాలను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తెలంగాణలోని గొల్ల, కురుమలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో గొర్రె పిల్లల పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్న విషయం విదితమే. అయితే మాదాసీ కురువలకు కూడా గొర్రెల యూనిట్లను పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మాదాసీ కురువలు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. కులవృత్తులకు చేయూత అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం మాత్రమే అని స్పష్టం చేశారు. కులవృత్తులను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనేది సీఎం కేసీఆర్ లక్ష్యమని ఉద్ఘాటించారు.

ప్రభుత్వం కల్పించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.. ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అని మాదాసీ కురువలకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు.

# మా వాళ్ల జోలికి వస్తే క్రేన్‌కు ఉరివేసి వేలాడదీస్తా.. కొండా మురళి వార్నింగ్



వరంగల్: వరంగల్‌లో కాంగ్రెస్ నేత కొండా మురళీ అనుచరులు, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అనుచరుల మధ్య నిన్న జరిగిన వివాదంపై కొండా మురళీ ఘాటుగా స్పందించారు. తన కార్యకర్తలను టచ్ చేస్తే నాలో పాత మురళీ బయటకు వస్తాడు అంటూ హెచ్చరించారు. తన కార్యకర్తల జోలికి వస్తే క్రేన్‌కు ఉరివేసి వేలాడదీస్తానంటూ వార్నింగ్ ఇచ్చారు. వరంగల్ తూర్పు టికెట్ కొండా సురేఖ దే... ఇది రేవంత్ రెడ్డే చెప్పారన్నారు. బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకోను అంటూ ప్రత్యర్థులను గట్టిగా హెచ్చరించారు. వరంగల్‌కు చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరతామని తనతో చెబుతున్నారు. కానీ వారిని పార్టీలోకి తీసుకోవాలా వద్దా అనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కొండా మురళీ పేర్కొన్నారు.

# తెలంగాణలో బీజేపీ లేనే లేదు: కేటీఆర్



హైదరాబాద్: సోషల్‌మీడియాలో తప్ప తెలంగాణలో బీజేపీ లేనే లేదని మంత్రి కేటీఆర్ ఎద్దేవాచేశారు. తెలంగాణలో తమతో పోటీ పడే పరిస్థితి కాంగ్రెస్‌కు లేదని తెలిపారు. అధికారంలోకి వస్తామంటూ కాంగ్రెస్ భ్రమల్లో ఉందని ఎద్దేవాచేశారు. తెలంగాణలో ప్రతిపక్షాలకు పని లేకుండా పోయిందన్నారు. ప్రతిపక్షాలకు పనిలేకే అసత్య ఆరోపణలు చేస్తున్నాయని, చేతిలో ఉన్న రూపాయిని పారేసి చిల్లర ఏరుకోవద్దని కేటీఆర్ సూచించారు. చిల్లర రాజకీయాలు చేసే నేతలను ప్రజలు పట్టించుకోరని గుర్తుచేశారు. తెలంగాణలో సమ్మిళిత అభివృద్ధి జరుగుతోందని, తెలంగాణలోని పాలనా సంస్కరణలు దేశంలో ఎక్కడా లేవని తెలిపారు. అన్నిరంగాల్లో తెలంగాణ తనదైన మార్క్ వేస్తోందని ప్రకటించారు. తెలంగాణ ఆచరిస్తోంది.. దేశం అనుసరిస్తోందని కేటీఆర్ చెప్పారు.

# దశాబ్ది ఉత్సవాలకు ప్రత్యేక అధికారులు

మేడ్చల్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేలా కలెక్టర్ అమోయ్‌కుమార్ ప్రత్యేక అధికారులను నియమించారు. జూన్ 2 నుంచి 22 వరకు ప్రణాళిక ప్రకారం ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. ప్రభుత్వం నిర్దేషించిన రోజువారి కార్యక్రమాలు జిల్లాలో సజావుగా జరిగేలా ప్రత్యేక అధికారుల కమిటీ పర్యవేక్షించనుంది.

**జిల్లా ప్రగతిని చాటుతాం :** దశాబ్ది ఉత్సవాలలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రగతిని చాటుతాం. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రతి రోజు జరిగే కార్యక్రమాలలో 2014కు ముందు, ఇప్పటి వరకు సాధించిన అభివృద్ధిని ప్రజలకు చూపించే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించాం. రోజువారి కార్యక్రమాలలో కరపత్రాలను



పంపిణీ చేస్తాం. మున్సిపాలిటీలు, ప్రధాన జంక్షన్లలో ఆర్చీలు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, విద్యుద్దీపాలను అలంకరించే కార్యక్రమాలు జరుగుతున్నాయి. **-కలెక్టర్ అమోయ్‌కుమార్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా**

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com